PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 134 | విజయవాడ, గురువారం 18 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 18 December 2025 | Rs

'వైష్ణోదేవి' మెడికల్ అడ్మిషన్లపై సంఘ్ పరివార్ విద్వేషం

- తమ మతం వారికే సీట్లు రిజర్వ్ చేయాలని డిమాండ్

7



పొగమంచుతో టి20 రద్దు

- ఐదు టి20ల సిరీస్‌లో 2-1 ఆధిక్యతలో టీమిండియా
- 19న అహ్మదాబాద్‌లో ఐదో, చివరి టి20

8

వికేంద్రీకరణతోనే అభివృద్ధి

• అందుకే అన్ని ప్రాంతాలపై దృష్టి • కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం



కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో జిఎస్‌డిపి వృద్ధి పెరగాలంటే అన్ని ప్రాంతాల్లో సమాన దృష్టి అవసరమని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే వికేంద్రీకరణ విధానాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ల సదస్సులో భాగంగా జిఎస్‌డిపి, శాఖల వారీగా కీ పర్‌ఫార్మెన్స్ ఇండికేటర్లపై బుధవారం కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాల్లోనే కాకుండా శాఖల్లో కూడా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ ఏడాది వృద్ధి లక్ష్యాన్ని 17.11 శాతంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. ఈ లక్ష్యం సాధించాలంటే 17 అంశాల్లో ఫలితాలు సాధించాల్సి ఉంటుందన్నారు. లైవ్ స్టాక్, ఉత్పాదక రంగం, ఫిషింగ్ వంటి రంగాలతో సహా ఇతర రంగాలపైనా కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ రంగం మరింతగా వృద్ధి చెందాలన్నారు. వీటన్నింటికీ జిల్లా స్థాయిలో ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వచ్చే సదస్సు నాటికి జిల్లాల్లో ప్రగతి కనిపించాలని స్పష్టం చేశారు. గతంలో తెలంగాణతో పోటీగా ఉన్న రాష్ట్రం గత పాలకుల తప్పుడు విధానాలతో దక్షిణ భారతదేశంలోనే చివరి స్థానానికి చేరుకుందని చెప్పారు. తిరిగి అగ్రస్థానానికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశలో కృషి చేయాలని కలెక్టర్లకు సూచించారు. అంతకు ముందు ప్రణాళిక శాఖ అధికారులు రాష్ట్రంలో జిఎస్‌డిపి, ఇతర వృద్ధి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సమర్పించారు. శాఖల వారీగా, జిల్లాల వారీగా ఉన్న జిఎస్‌డిపి, కెపిఐ, ర్యాంకులను వివరించి చెప్పారు.

వ్యవసాయ రంగంపైనే

జిఎస్‌డిపిలో వ్యవసాయ రంగం కీలకమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. దీనిపై మరింతగా ఫోకస్ పెట్టాలని సూచించారు. ఈ రంగంలో ఎంత చేస్తున్నా కూడా ఇంకా చేయాల్సింది చాలా ఉంటోందన్నారు. ప్రధానంగా మార్కెట్ ఇంటలిజెన్స్‌ను బలోపేతం చేయాలని నిర్దేశించారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు రాష్ట్ర ఉత్పత్తులు ఎగుమతులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల ఈ రంగంలో సుస్థిరత సాధించాలన్నారు. రబీ, ఖరీఫ్ పంటల కోసం 10 నుంచి 15 ఏళ్లకు కావాల్సిన ప్రణాళికలు ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలన్నారు. డిమాండ్ ఉన్న పంటలు, నీటి లభ్యత, ఫుడ్ ప్రాసెసింగ్, సాంకేతికత వంటి అంశాలను అనుసంధానం చేసుకోవాలని సూచించారు. 2047కి నాటి రాష్ట్రం అగ్రస్థానానికి చేరుకునేలా ప్రణాళికలు ఉండాలన్నారు. సేవా రంగం ద్వారా జిఎస్‌డిపి పెరుగుతుందని, అందుకు పర్యాటకంపై ఎక్కువ దృష్టి పెట్టాలని, సూర్యలంక వంటి బీచ్‌లకు ఎక్కువ పెట్టుబడులు వచ్చేలా చూడాలని నిర్దేశించారు.

పెట్టుబడులకు కలెక్టర్లే కీలకం

రాష్ట్రంలో పెట్టుబడులను విస్తృతం చేసేందుకు కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని చంద్రబాబు అన్నారు. ఎపిఐఐసిలో అందుబాటులో ఉన్న భూమిపైనా చర్చించారు. అయితే, 82 వేల ఎకరాలు 22ఎ పరిధిలోకి వెళ్లిపోయాయని అధికారులు చెప్పగా, వాటికి సంబంధించిన సాంకేతిక అంశాలు అధ్యయనం చేయాలని, అవకాశం మేరకు ఈ భూముల వివరాలను మంత్రివర్గానికి కూడా సమర్పించాలని సిఎం సూచించారు. పెట్టుబడులకు చేసే భూ కేటాయింపుల్లో తొలి ప్రాధాన్యం పర్యాటకశాఖకు ఇవ్వాలని, తరువాత ఐటి సంస్థలకు ఇవ్వాలని సూచించారు.

విశాఖ, విజయవాడల్లో భూ ట్రిబ్యునల్స్

పెట్టుబడులకు భూ సమస్యలు రాకుండా చూసేందుకు విశాఖపట్నం, విజయవాడల్లో భూ ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఒక కుటుంబం, ఒక పారిశ్రామిక వేత్త లక్ష్యం సాధించేందుకు ఎంఎస్ఎంఇలపై సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకం రంగంపైనా దృష్టి సారించి వచ్చిన వారికి భూమి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు.

జనవరి నుండి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

జనవరి నుండి జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సిఎస్ విజయానంద్ స్వాగతోపాన్యాసం అనంతరం సిఎం మాట్లాడుతూ వివిధ అంశాలపై ప్రజల నుండి వచ్చే వినతుల పరిష్కారమే ప్రధానంగా ఈ తనిఖీలు ఉంటాయని చెప్పారు. 15 శాతం వృద్ధి లక్ష్యంగా పనిచేయాలని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. జిల్లాల్లో అనుసరించే బెస్ట్ ప్రాక్టీసెస్‌ను ఇతర ప్రాంతాల్లో కూడా అమలు చేస్తూ లక్ష్యాలకు అనుగుణంగా 15 శాతం వృద్ధిరేటు సాధించడమేమి కష్టం కాదని చెప్పారు. నీటి భద్రత, ఉద్యోగాల కల్పన, అగ్రిటెక్ లాంటి అంశాల ద్వారా అనుకున్న లక్ష్యాల వృద్ధిని సాధించాలన్నారు. ఇకపై రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ఉండాలన్నారు. పొలిటికల్ గవర్నెన్స్ అనేది కీలకమని, ప్రజాప్రతినిధుల సూచనలు అమలయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్లే బ్రాండ్ అంబాసిడర్లని, ప్రభుత్వం నిర్దేశించిన పది సూత్రాలను పటిష్టంగా అమలు చేసి లక్ష్యాల సాధనలో భాగస్వామ్యులు కావాలన్నారు. పిపిపి విధానంలోనే ప్రభుత్వం వైద్యకళాశాలలను నిర్మిస్తామని, దీనివల్ల ప్రజలకు సౌకర్యాలు మెరుగుపడతాయని చెప్పారు.

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం లక్ష్యాలను కలెక్టర్లు ముందుకు తీసుకెళ్ళాలన్నారు. పంచాయతీరాజ్ సిబ్బంది దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచామని, కలెక్టర్ల చొరవతో పల్లె పండుగ 1.0ను నిర్దేశిత గడువులోగా పూర్తి చేశామన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నరేగా నిధులతో గతేడాది చేపట్టిన పల్లె పండుగ 1.0ద్వారా గ్రామాల్లో 4వేల కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లు అనుకున్న సమయానికి పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు.



పార్లమెంటు వద్ద ఆందోళన చేస్తున్న ప్రతిపక్షాల సభ్యులు

అభ్యంతరాలు బేఖాతర్

ఉపాధి హామీ రద్దుతో పాటు, మరో రెండు కీలక బిల్లులు ఆమోదం

- పార్లమెంటులో ప్రతిపక్షాల తీవ్ర నిరసన
- విస్తృత పరిశీలనకు పంపడానికి తిరస్కరణ
- ఆమోదం పొందిన అణురంగం ప్రైవేటీకరణ, వందశాతం ఎఫ్‌డిఐ బిల్లులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన మూడు కీలక బిల్లుల విషయంలో మోడీ సర్కారు పూర్తి ఏకపక్షంగా వ్యవహరించింది. ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నా ఏమాత్రం ఖాతరు చేయలేదు. బిల్లులను తాత్కాలికంగా ఆపి విస్తృత పరిశీలనకు పంపాలంటూ ప్రతిపక్షాలు చేసిన డిమాండ్‌ను కూడా తిరస్కరించింది. సంఖ్యా బలాన్ని ఆధారం చేసుకుని ఒక్క పూటలోనే మూడు బిల్లులను ఆమోదించింది. బుధవారం లోక్‌సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే ఉపాధి హామీ చట్టం-2005ను సవరణ చేస్తూ తీసుకొచ్చిన విబిజి ఆర్ఎఎం జిబిల్లును, పౌర అణుశక్తి రంగాన్ని ప్రైవేటు రంగానికి అప్పగించే మరో బిల్లును ఆమోదించారు. రాజ్యసభలో ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య బీమారంగంలో వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డిఐ)కు అనుమతి ఇస్తూ తీసుకొచ్చిన బిల్లు కూడా ఆమోదం పొందింది. లోక్‌సభలో ఉపాధి హామీ బిల్లును కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చర్చకు ప్రవేశపెట్టగా ప్రతిపక్ష సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ బిల్లుతో గ్రామీణ ఉపాధి రంగం కుదేలవుతుందని, మిగతా 7లో

ఉపాధి హామీలో మార్పులను వ్యతిరేకిస్తూ

22న దేశవ్యాప్త నిరసనలు

- వామపక్షాల పిలుపు

7

రేపు ఢిల్లీకి సిఎం

- నల్లమల సాగర్‌కు అనుమతుల సాధనే లక్ష్యం
- 21 కిలోమీటర్లకు టన్నెల్ తగ్గింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోలవరం నల్లమలసాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ మేరకు ఆయన షెడ్యూల్ ఖరారైంది. నల్లమల సాగర్‌కు వ్యతిరేకంగా తెలంగాణా జలవనరులశాఖ అధికారులు సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోడీతోపాటు జలవనరులశాఖ మంత్రి సిఆర్ పాటిల్‌నూ కలవనున్నారు. నల్లమల సాగర్‌కు అనుమతులతో పాటు, పోలవరం ప్రాజెక్టుకు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఈ పర్యటనలో కేంద్రాన్ని సిఎం కోరనున్నట్లు తెలిసింది. గతంలో ప్రతిపాదించిన పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు పర్యావరణ శాఖ అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆ ప్రాజెక్టులో సుమారు 37 కిలోమీటర్ల దూరం టన్నెల్ నిర్మించాలనీ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనపై అభ్యంతరం రావడంతో బనకచర్లను రెండు దశలుగా విభజించారు. టన్నెల్ నిర్మాణాన్ని మొదటి దశ నుండి మినహాయించారు. మొదటిదశకు రూ.58,700 కోట్లు ఖర్చవుతాయని లెక్కలేశారు. దీనిపై పర్యావరణశాఖకు అనుమతికోసం దరఖాస్తు చేయడంతో సిడబ్ల్యుసి అనుమతులు కావాలని సూచించారు. దీంతో రాష్ట్ర జలవనరులశాఖ అధికారులు నల్లమలసాగర్ అనుమతి కోసం సిడబ్ల్యుసికి దరఖాస్తు చేసింది. దీనికి సంబంధించి ప్రీ ఫీజుబులిటి రిపోర్టు(పిఎఫ్ఆర్) కూడా సమర్పించారు. దీనికి అనుమతి వస్తే డిపిఆర్ తయారు చేసి పర్యావరణ అనుమతికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సిడబ్ల్యుసి అనుమతులు, పర్యావరణ అనుమతులు కీలకం కావడంతో వీటిపైనా సిఆర్ పాటిల్‌తో చర్చించే అవకాశం ఉంది. మరోవైపు తెలంగాణా ప్రభుత్వం దాఖలు చేసిన పిటీషన్‌పై చర్చించేందుకు జలవనరుల శాఖ కార్యాలయంలో న్యాయవాదులు బుధవారం సమావేశమయ్యారు. తెలంగాణా దాఖలు చేసిన ఫిర్యాదు విచారణ అర్హం కాదని తేల్చారు. వారు దాఖలు చేసిన పిటీషన్లో పోలవరంలో మార్పులు చేర్పులు ఉన్నట్లు ప్రస్తావించారని, అటువంటిదేమీ లేనప్పుడు అనుమతే ఇవ్వని ప్రాజెక్టుపై కేసు ఎలా దాఖలు చేస్తారనే అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లాలని అభిప్రాయపడినట్లు తెలిసింది. జలవనరులశాఖ సలహాదారు, ఇఎన్‌సి కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

వెండి ధగధగలు..

- తులం రూ.2,060

3

చమురు ట్యాంకర్ల దిగ్బంధనం

- వెనిజులాపై మరిన్ని చర్యలకు తెగబడిన అమెరికా
- మదురోపై విషం చిమ్మిన ట్రంప్

7

19న రాష్ట్ర వ్యాప్త నిరసనలు

'ఉపాధిహామీ' రద్దుపై సిపిఎం పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలకు నిరసనగా ఈనెల 19న అన్ని జిల్లా, పట్టణ కేంద్రాలలో గాంధీ విగ్రహాలవద్ద సత్యాగ్రహ, మౌనదీక్షలతో నిరసన తెలియజేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. చట్టబద్ద హక్కుగా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (విబి-జి ఆర్ఎమ్ జి) పేరుతో ఉపాధిహామీ పథకానికి "రాంరాం" పలకనున్నారని పేర్కొన్నారు. పని హక్కుగా ఉన్న పాత చట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా అమలు చేయనున్నారని తెలిపారు. ఇప్పటి వరకు వ్యవసాయ కార్మికులకు డిమాండ్‌ను బట్టి ఉపాధి కల్పించే విధానాన్ని మార్చివేసి అవసరాన్ని (సప్లయిని) బట్టి పనులు పెట్టడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమేనని విమర్శించారు. గ్రామీణ కూలీలకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని పక్కదారి పట్టించేందుకు ఈ పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించారని తెలిపారు. పనిదినాలు 100 నుండి 125 రోజులకు పెంచనున్నట్లు చెప్పడం ప్రజలను మభ్యపెట్టేందుకేనని, ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం కొత్త బిల్లు వల్ల నామమాత్రంగా మారుతుందని పేర్కొన్నారు.

మరోవైపు 10 నుండి 40 శాతానికి రాష్ట్రాలపై భారం పెంచారని, ఇప్పటికే యంత్రాలు కేటాయించి కూలీల డిమాండ్ తగ్గించారని విమర్శించారు. వ్యవసాయ పనుల పేరుతో 60 రోజుల ఉపాధిని సస్పెండ్ చేసి ఈ పథకాన్ని రైతులకు పోటీగా మారుస్తోందని పేర్కొన్నారు. ఈ పథకం అమలుకు ఇప్పటి వరకు కేంద్రం ఇస్తున్న 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై వేల కోట్ల అదనపు భారం వేస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంపై ఏటా సుమారు నాలుగు వేల కోట్లు అదనపు భారం పడనుందని, ఇప్పటికే లక్షల కోట్లు అప్పుల్లో వున్న రాష్ట్రం ఈ అదనపు భారాన్ని ఎలా భరించగలదని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వానికి కీలక మద్దతుగా వున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించుకునేటట్లు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. మన రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపీలు పార్లమెంటులో దీన్ని వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 19వ తేదీ గాంధీజీ విగ్రహాల వద్ద సిపిఎం చేస్తున్న నిరసనల్లో పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రాష్ట్ర కమిటీ కోరింది.



నేడు ఒమన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

న్యూఢిల్లీ : ఒమన్‌తో గురువారం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగనుందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. మస్కట్‌లో జరిగిన ఇండియా, ఒమన్ బిజినెస్ ఫోరమ్‌లో మంత్రి మాట్లాడుతూ.. ఈ ఒప్పందం భారత్‌కు వస్త్రాలు, పాదరక్షలు, ఆటోమొబైల్స్, రత్నాలు, ఆభరణాలు, పునరుత్పాదక ఇంధనం, ఆటో విడిభాగాలతో సహా అనేక రంగాలలో అపారమైన అవకాశాలను అందిస్తుందని పేర్కొన్నారు. గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ ప్రాంతం, తూర్పు యూరప్, మధ్య ఆసియా, ఆఫ్రికా వంటి ఇతర మార్కెట్‌లకు ఒమన్ ద్వారా లభించే ప్రవేశం వల్ల భారత్ మరింత ప్రయోజనం పొందుతుందని తెలిపారు.

పార్టీ మారినట్టు ఆధారాల్లేవ్...

- ఐదుగురు బిఆర్ఎస్ ఎంఎల్ఎలకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ క్లీన్‌చిట్
- సింగిల్ లైన్ స్టేట్‌మెంట్‌తో తీర్పు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పార్టీ ఫిరాయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు ఎంఎల్ఎల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. సాంకేతికంగా ఐదుగురు ఎంఎల్ఎలు బిఆర్ఎస్ సభ్యులుగానే ఉన్నారని, వారు పార్టీ మారినట్టు ఎలాంటి ఆధారాలూ లేవని స్పీకర్ తన తీర్పులో పేర్కొన్నారు. తెలంగాణ ఎంఎల్ఎలు తెల్లం వెంకట్రావ్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, టి.ప్రకాష్‌గౌడ్, అరికెపూడి గాంధీపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. ఈ ఐదుగురు శాసనసభ్యులూ పార్టీ మారినట్టు ఫిర్యాదుదారులు ఆధారాలు చూపలేకపోయారని, ఈ దృష్ట్యా అనర్హత వేటుకు తగిన ఆధారాలు లేవని, సాంకేతికంగా ఆ ఐదుగురు ఎంఎల్ఎలూ బిఆర్ఎస్‌లోనే ఉన్నారని తీర్పులో స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు అసెంబ్లీకి స్పీకర్ వచ్చారు. షెడ్యూల్ ప్రకారం మూడున్నర గంటలకు ట్రిబ్యునల్ చైర్మన్‌గా ఓపెన్ కోర్టులో 'ఈ ఐదుగురు ఎంఎల్ఎలుగా కొనసాగుతారు' అనే సింగిల్ లైన్ స్టేట్‌మెంటు ఇచ్చారు. అనంతరం అసెంబ్లీ ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు. ఈ తీర్పుతో ఆ ఐదుగురు ఎంఎల్ఎలకు భారీ ఊరట లభించినట్లయ్యింది. బిఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను తిరస్కరించినట్లయ్యింది.

రాజ్యాంగబద్ధ తీర్పు : అసెంబీ కార్యదర్శి

అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ రాజ్యాంగబద్ధంగా తీర్పు ఇచ్చారని తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి నరసింహాచార్యులు పేర్కొన్నారు. ఐదుగురు బిఆర్ఎస్ మిగతా 7లో

కర్నూలులోనే లోకాయుక్త, హెచ్‌ఆర్‌సి

- హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి

లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సి)ను కర్నూలులోనే కొనసాగిస్తామని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. ఈ వ్యవహారంపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన డివిజన్ బెంచ్ విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. లోకాయుక్త, హెచ్‌ఆర్‌సిను కర్నూలులో ఏర్పాటు చేయాలన్న గత ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మద్దిపాటి శైలజ 2021లో పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ న్యాయవాది డిఎస్ఎన్‌పి ప్రసాద్ వాదిస్తూ.. రాజధానిలో జస్టిస్ సిటీ పేరుతో కోర్టుల సముదాయాన్ని ఏర్పాటు చేస్తున్నందున లోకాయుక్త, హెచ్‌ఆర్‌సి కూడా విజయవాడలోనే ఏర్పాటు చేసేలా ఉత్తర్వులివ్వాలని కోరారు. ఉత్తరాంధ్రలో ఉండే వారు కర్నూలు వెళ్లడం వ్యయప్రయాసలకు గురవుతారని చెప్పారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సింగమనేని ప్రణతి ప్రతివాదన చేస్తూ.. లోకాయుక్త, హెచ్‌ఆర్‌సిను కర్నూలులోనే కొనసాగిస్తామన్నారు.

మిగులు విద్యుత్ అమ్ముకుంటాం

- ఎపిఇఆర్‌సికి డిస్కమ్‌ల సమాధానం
- పిఎం కుసుమ్ ప్రాజెక్టులకు టారీఫ్ నిర్ధారించిన కమిషన్
- రూ.3.19 వరకు ఎపిఇఆర్‌సి అనుమతి ఉత్తర్వులు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అడ్డగోలుగా చేసుకుంటున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పిపిఎ)లో మిగులు విద్యుత్ ఉంటే బహిరంగ మార్కెట్‌లో వాటిని అమ్ముతామని విద్యుత్ పంపిణీ సంస్థలు.. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)కి సమాధానం చెప్పాయి. మిగులు విద్యుత్‌లో ఉన్న డిస్కమ్‌లు ఇప్పటికే సెకీతో ఒప్పందాన్ని చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో పాటు ఇటీవల పిఎం కుసుమ్ కింద 3,725 మెగావాట్లకు పిపిఎలకు సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా ఇటీవల 1,162.8 మెగావాట్లకు బహిరంగ విచారణ నిర్వహించిన ఎపిఇఆర్‌సి 22 ప్రాజెక్టులకు టారీఫ్‌ను నిర్ధారిస్తూ బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ ఒప్పందం వెనుక జరిగిన కొన్ని అంశాలను ఎపిఇఆర్‌సి ఉత్తర్వుల్లో పేర్కొంది. సెకీ నుంచి యూనిట్ రూ.2.49 చొప్పున ఇప్పటికే 7 వేల మెగావాట్లకు రాష్ట్ర ప్రభుత్వం, డిస్కమ్‌లు ఒప్పందం కుదుర్చుకున్న విషయాన్ని ప్రస్తావించింది. సెకీ, పిఎం కుసుమ్ ఒప్పందాల వల్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అయ్యే సమయంలో మిగులు విద్యుత్ ఉంటుందని, దీనిని ఏం చేస్తారని ప్రశ్నించింది. సెకీ 7 వేల మెగావాట్ల ఒప్పందం 2025 జూన్ నుంచి 2029 మధ్య అమల్లోకి వస్తుందని సమాధానం చెప్పిన డిస్కమ్‌లు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం (బెస్) ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకున్నామని తెలిపాయి. అదేవిధంగా 7,500 మెగావాట్లకు ఎపి జెన్‌కో.. పంప్డ్ స్టోరేజ్ హైడ్రో స్టేషన్లు (పిఎస్‌హెచ్‌పి) అభివృద్ధి చేస్తుందని పేర్కొన్నాయి. సెకీ, ఎఫ్ఎల్ఎస్ ప్రాజెక్టు వల్ల ఉత్పత్తి అయ్యే విద్యుత్ పిఎస్‌హెచ్‌పి ప్రాజెక్టులకు ఉపయోగపడుతుందని పొందుపరిచాయి. అనివార్యంగా మిగులు విద్యుత్ ఉంటే దానిని విద్యుత్ మార్కెట్‌లో విక్రయిస్తామని సమాధానం చెప్పాయి. సోలార్ ఉత్పత్తి అయ్యే సమయంలో బహిరంగ మార్కెట్‌లో యూనిట్ ధర రూ.2.50లోపే దొరుకుతుంది. ఇలాంటి సమయంలో పిపిఎలు చేసుకోవాల్సిన అవసరం ఏమిటని విద్యుత్ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఫీడర్ లెవల్ సోలారైజేషన్ (ఎఫ్ఎల్ఎస్)లో భాగంగా ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో 751 మెగావాట్లు, ఎపిసిపిడిసిఎల్ పరిధిలో 191.5 మెగావాట్లు, ఎపిఇపిడిసిఎల్ పరిధిలో 220.30 మెగావాట్ల చొప్పున కేటాయించింది. మొత్తం 22 ప్రాజెక్టులకు యూనిట్‌కు రూ.3.2 నుంచి రూ.3.19 వరకూ టారీఫ్‌ను నిర్ధారించింది. ఈ 22 ప్రాజెక్టుల పరిధిలో 2,93,587 వ్యవసాయ పంపుసెట్లు ఉంటాయని పేర్కొంది. మెఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎకోరన్, ఐ సోలార్ టెక్నాలజీస్, అర్జున్ ఇన్‌ఫ్రాటెక్, మెహన్ స్పిన్‌టెక్స్, ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పరడిగిమ్ ఐటి టెక్నాలజీ, నోవెల్ లాజిస్టిక్స్, సంగమ్మమ్, భవ్య హెల్త్ సర్వీసెస్ కంపెనీలకు ఈ ప్రాజెక్టులను అప్పగించింది. రెండేళ్లలో ఈ ప్రాజెక్టులు పూర్తి కావాలని పేర్కొంది. 25 ఏళ్ల పాటు ఈ ఒప్పందం అమల్లో ఉంటుందని పేర్కొంది.

వేలూరు స్వర్ణదేవాలయాన్ని సందర్శించిన రాష్ట్రపతి

ప్రజాశక్తి - రేణిగుంట
తమిళనాడులోని వేలూరు స్వర్ణదేవాలయాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందర్శించారు. అనంతరం తిరుగు ప్రయాణమైన రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. మధ్యాహ్నం 1.55 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమైన ఆమెకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ వీడ్కో లు పలికారు. రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, తిరుపతి జిల్లా ఇంచార్జి జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, ఎస్‌పి ఎల్. సుబ్బరాయుడు, శ్రీకాళహస్తి ఆర్‌డిఒ భానుప్రకాష్‌రెడ్డి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

పట్టు రైతులకు అండగా ప్రభుత్వం

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
పట్టు రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచి, గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 2023 నుంచి 2025 వరకూ పట్టు పరిశ్రమలశాఖ రాష్ట్ర వాటాగా రూ.14 కోట్లను విడుదల చేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మొత్తంలో రూ.13 కోట్ల 75 లక్షలకు సంబంధించిన బిల్లులు గుంటూరు పే అండ్ అకౌంట్స్ కార్యాలయానికి సమర్పించగా, లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. ఈ నిధులతో రాష్ట్రంలోని 13,663 మంది పట్టు రైతులకు లబ్ధి చేకూరిందన్నారు.

మెడికల్ పిపిపిలో భారీ కుంభకోణం

- వైసిపి నేతల ఆరోపణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వెనుక భారీ కుంభకోణం ఉందని వైసిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ మంత్రి అమర్‌నాథ్, అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ బుధవారం వేర్వేరుగా మాట్లాడారు. పిపిపి ముసుగులో అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారని, రెండేళ్ల ఆ సిబ్బందికి ప్రభుత్వ జీతాల్లో మరో కుంభకోణమని అన్నారు. ప్రజాభిప్రాయాన్ని కూడా ముఖ్యమంత్రి లెక్క చేయడం లేదని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను బినామీలకు రాసిస్తున్నారని పేర్కొన్నారు. మళ్లీ అధికారం లోకి రాబోమని ముఖ్యమంత్రికి అర్థమైందని, అందుకే యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంటరీ స్థాయీ సంఘం నివేదికలకూ వక్రభాష్యం చెబుతున్నారని, దోపిడీకి భాగస్వాములు ఎవరైనా వదిలే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన వచ్చిందని తెలిపారు. 1.36 కోట్ల మందికిపైగా సంతకాలు చేశారని వివరించారు. పిపిపి నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జి సిఎమ్‌డి మనీష్‌రాజ్‌గుప్తా

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జి సిఎమ్‌డిగా మనీష్‌రాజ్‌గుప్తా

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)
విశాఖ స్టీల్‌ప్లాంట్ (ఆర్‌ఐఎన్‌ఎల్) ఇన్‌ఛార్జి సిఎమ్‌డిగా మనీష్‌రాజ్‌గుప్తాను కేంద్ర ప్రభుత్వం నియమించింది. 2026 జనవరి ఒకటి నుంచి ఒక సంవత్సరం పాటు లేదా ఆ పదవికి రెగ్యులర్ నియామకం జరిగే వరకూ లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఏది ముందు జరిగితే అది అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో టెక్నికల్, ప్రాజెక్ట్సు అండ్ రా మెటీరియల్స్ డైరెక్టర్‌గా మనీష్‌రాజ్ గుప్తా విధులు నిర్వహిస్తున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఫిరంగిపురం (గుంటూరు జిల్లా)


బొల్లయ్య (ఫైల్)

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన గుంటూరు జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... ఫిరంగిపురం మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన మర్రి బొల్లయ్య (36) తన రెండున్నర ఎకరా సొంత పొలంతో పాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి సాగుచేశారు. కౌలు, పెట్టుబడి కోసం రూ.15 లక్షల మేర అప్పులు చేశారు. తుపాన్లు, భారీ వర్షాల కారణంగా దిగుబడి తగ్గిపోయింది. అప్పులకు తోడు వడ్డీల భారం అధికమవ్వడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో పొలంలోనే పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. బొలయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఖర్చు చేయని పిఎంఎవై నిధులు

- రూ.1,268 కోట్లకు రూ.480 కోట్లే ఖర్చు
- సిఎం చంద్రబాబు అసంతృప్తి
- జనవరి 15లోపు వినియోగించాలని ఆదేశం



కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) పథకం అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పథకానికి కేటాయించిన నిధులను ఖర్చు చేయడంలో రాష్ట్రం వెనుకబడిందని తెలిపారు. కలెక్టర్ల సదస్సులో భాగంగా సచివాలయంలో బుధవారం కేంద్ర ప్రాయోజిత పథకాలు (సిఎస్‌ఎస్) అమలుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ పథకాల అమలు తీరుపై ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోజ్ వివరించారు. కేంద్ర ప్రభుత్వం 75 పథకాలకు రూ.15,173 కోట్లు కేటాయించిందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.9,340 కోట్లు ఇస్తుందని రోనాల్డ్ తెలిపారు. పిఎంఎవై అర్బన్ పథకం కింద రూ.1,268 కోట్లు ఉంటే ఇందులో కేవలం రూ.480 కోట్లు (38 శాతం) ఖర్చు అయినట్లు పేర్కొన్నారు. సమగ్ర శిక్షకు రూ.1,363 కోట్లకు రూ.1,259 కోట్లు (92 శాతం) ఖర్చు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజనకు రూ.1,018 కోట్లకు రూ.555 కోట్లు (55 శాతం) ఖర్చు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఒకవైపు డబ్బు లేక ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు కేంద్రం నిధులను సరిగ్గా ఖర్చు చేయలేకపోతున్నామని చెప్పారు. ఈ నిధులు ఖర్చు చేస్తే కేంద్రం నుంచి మరో రూ.1,200 కోట్లు వస్తాయని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ మంత్రితోపాటు కలెక్టర్లందరూ దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అన్ని కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను జనవరి 15వ తేదీలోపు ఖర్చు చేయాలని ఆదేశించారు. కేంద్రం నుంచి వచ్చే ప్రతి రూపాయి ఖర్చు చేయాలని చెప్పారు. నిర్మాణ సంస్థలు, ఏజెన్సీలను 10 రోజులకోసారి పిలిచి సివిల్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

వారాల తరబడి స్పందించకపోతే వాళ్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని సూచించారు. అన్ని శాఖల అధిపతులు తమ ఆడిట్లను వీలైనంత త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 10,750 ప్రభుత్వ ఖాతాల్లో రూ.155 కోట్లు క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఉన్నాయని రోనాల్డ్ వివరించారు.


నివాళులర్పిస్తున్న రమాదేవి, భాష్యం ప్రవీణ్, వై.నేతాజి తదితరులు

కార్మిక నేత సాంబశివరావుకు కన్నీటి వీడ్కోలు

- ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి - గుంటూరు
పోస్టల్ అండ్ టెలికం డిపార్ట్‌మెంట్ (పిఎటి), బిఎస్‌ఎన్‌ఎల్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో యూనియన్ నాయకులుగా పనిచేసిన వెల్లలచెరువు సాంబశివరావుకు బుధవారం కన్నీటి వీడ్కోలు పలికారు. గుంటూరులోని కొరిటపాడు మహాప్రస్థానంలో అంత్యక్రియలను ఆయన పెద్ద కుమారుడు రజనీకాంత్ నిర్వహించారు. సాంబశివరావు భౌతికదేహాన్ని ప్రముఖ రాజకీయ, వామపక్ష నాయకులు సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళు లర్పించిన వారిలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య, మాజీ మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్, గల్లా మాధవి, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, సిపిఎం జిల్లా, నగర కార్యదర్శులు వై.నేతాజి, కె.నళినీకాంత్, నాయకులు పాశం రామారావు, సిపిఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



'ఉద్యమ కెరటాలు-కార్మిక గీతాలు' పాటల ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
సిఐటియు అఖిల భారత మహాసభలు సందర్భంగా విశాఖపట్నంలో జనవరి 4న భారీ బహిరంగ సభ, ప్రదర్శన నిర్వహిం చనున్నామని, ఇందు కోసం 'ఉద్యమ కెరటాలు–కార్మిక గీతాలు' పేరుతో రూపొందించిన పాటలను, ఆడియో సిడిని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, యూనియన్ ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి డి.రమాదేవి, ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు కవి ఆవిష్కరించారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికవర్గ సమస్యలు, హక్కులు, తదితర అంశాలపై 30 మంది రచయితలు పాటలు రాసి అందజేసినట్లు తెలిపారు. ఈ గీతాలకు ప్రజా నాట్యమండలి బాణీలు కూర్చిందన్నారు. నల్లి ధర్మారావు, డి దశరథ, చల్లా రవికుమార్, ఎం చంటి, టి పెద్దిరాజు, పి మంగరాజు, తదితర రచయితలకు, గీతాలు ఆలపించిన గాయకులు పి సూర్యకుమారి, కె ప్రేమజ్యోతి, ఐవి, ఎం చంటి, పి మంగరాజు, కె గణేష్, అనుప్రసాద్‌కు, బాణీలు కూర్చిన ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీకి సిఐటియు తరపున ధన్యవాదాలను ఈ సందర్భంగా ఎవి నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు ఆర్‌వి నరసింహారావు, ప్రజానాట్య మండలి కళాకారులు కెఆర్‌కె మూర్తి, గుండు నారాయణ పాల్గొన్నారు.

క్వాంటం టెక్నాలజీలో 29 ఎంఒయులు

- ఏటా ఐదు వేల మందికి శిక్షణ
- క్వాంటం వ్యాలీకి అనుసంధానంగా 200 ఎకరాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
క్వాంటం టెక్నాలజీకి సంబంధించి ఇప్పటి వరకూ 29 ఎంఒయులు కుదుర్చుకున్నామని ఐటిశాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ తెలిపారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భాగంగా క్వాంటం టెక్నాలజీపై ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏటా ఐదువేల మందికి క్వాంటం టెక్నాలజీలో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థులు, యువతకు అమరావతి క్వాంటం వ్యాలీ కేంద్రంగా 2030 నాటికి ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. అమరావతిలో వ్యాలీకి రూ.2,847 కోట్ల పెట్టుబడులకు అవగాహనా ఒప్పందాలు చేసుకున్నట్లు వివరించారు. దీనికి సంబంధించి హార్డ్‌వేర్ సంస్థలు కూడా పెద్దయెత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయని వివరించారు.

దీనికోసం మరో 200 ఎకరాలు అవసరం అవుతుందని, రాజధాని అమరావతికి అనుసంధానంగా ఈ భూమిని సేకరించే ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. 2026లో ఐబిఎం నుంచి రెండు క్వాంటం కంప్యూటర్లు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. క్వాంటం వ్యాలీ భవన నిర్మాణాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేసేలా పనిచేస్తున్నామని చెప్పారు. 2030కి 6.5 గిగావాట్ డేటా సామర్థ్యంతో కూడిన సెంటర్లను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. రూ.2,97,707 కోట్ల పెట్టుబడులతో డేటా సెంటర్లు ఏర్పాటు చేయడానికి పలు సంస్థలు ముందుకొచ్చాయని, వీటికి సంబంధించి భూ సేకరణ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

'ఉపాధి'కి కనురెప్పల ముప్పు!

- రాష్ట్రంలో 12.73 లక్షల పేర్లు గల్లంతు
- హౌసింగ్ లబ్ధిదారులకు లబ్ధి లేనట్లే!

ప్రజాశక్తి- కడప ప్రతినిధి
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. తాగునీరు, పనిముట్ల ఇన్సెంటివ్‌ల కోత, బడ్జెట్ కుదింపు, పని ప్రదేశంలో రెండు పూటలా ఫొటోలు వంటి చర్యల ద్వారా ఉపాధి వేతనదారులను (కార్మికులను) తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఏటా బడ్జెట్లో నిధులు తగ్గిస్తోంది. తాజాగా ఐస్ బ్లింకింగ్ (కనురెప్పలు మూసి తెరవడం) విధానం పేరిట భారీగా కార్మికులను తొలగించింది.

రాష్ట్ర వ్యాప్తంగా 12.73 లక్షల మంది పేర్లు గల్లంతయ్యాయి. ఇందులో ఒక్క వైఎస్‌ఆర్ కడప జిల్లాలో 53 వేల మందికిపైగా కార్మికులను తొలగించబడ్డారు. ఏడు అంశాలను ప్రాతిపదికగా తీసుకున్నట్లు చెప్తోంది. శాశ్వత వలసదారులు, హౌసింగ్ లబ్ధిదారులు, మృతులు, 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, ఉపాధి పనులకు రానివారు, ఉద్యాన సాగుదారులు, బ్యాంకు ఖాతాలతో అనుసంధానం కానివారు అనే పేరిట సుమారు 14 శాతం మంది ఉపాధి కార్మికుల పేర్లను తొలగించింది. ఈ ఏడాది అక్టోబర్ 8వ తేదీ వరకూ రాష్ట్రంలో 1.24 కోట్ల మంది ఉపాధి వేతనదారులు ఉండేవారు. నవంబర్ 19వ తేదీ నాటికి ఆ సంఖ్య 1.10 కోట్లకు తగ్గింది. ఆ తర్వాత ఈ సంఖ్య 90,56,192 కుదించబడింది. అయితే, ఐస్ బ్లింకింగ్ పేరిట 90,51,673 కార్మికులను ఆధార్‌తో అనుసంధానించింది. 77,83,007 కార్మికులకు ఇకెవైసి పూర్తి చేసింది. డిసెంబర్ మొదటి వారంతో ఐస్ బ్లింకింగ్, ఇకెవైసి ప్రక్రియను పూర్తి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 12,73,185 మంది పేర్లు తొలగించింది. దీంతో, వారికి ఉపాధి గల్లంతైంది. అర్హత ఉన్న వారు సంక్రాంతి తర్వాత తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పక్కాగృహాల లబ్ధిదారులను ఉపాధి పనిదినాల నుంచి దూరం చేసింది. ఈ దృష్ట్యా వచ్చే బడ్జెట్లో కూడా ఉపాధికి నిధులు తగ్గించే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఉపాధి పనులు జరుగుతున్నాయి. ఈ తొలగింపు వల్ల వీరికి ఈ పనులు లభించడం లేదు. పైగా, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ పేరును వికసిత భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) మారుస్తూ పార్లమెంటులో కేంద్రం ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టింది. పేరును మార్చవద్దని, అర్హులందరి ఆధార్ సీడింగ్, ఇకెవైసి పూర్తి స్థాయిలో జరిగేలా చూడాలని, ఐస్‌బ్లింకింగ్ పేరిట తొలగింపులు ఆపాలని, పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని ఉపాధి కార్మికులు కోరుతున్నారు.

వెళ్లడానికి ఇష్టపడని లబ్ధిదారులకు ఇతర ప్రాంతాల్లో స్థలాలు

- గృహ నిర్మాణశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
గ్రామాలకు దూరంగా గతంలో ఇళ్ల స్థలాలు కేటాయించడంతో అక్కడకు వెళ్లడానికి ఇష్టపడని లబ్ధిదారులకు ఇతర ప్రాంతాల్లో స్థలాలు కేటాయించాలని జిల్లాల కలెక్టర్లను సిఎం చంద్రబాబు ఆదేశించారు. తిరుపతి వంటి నగరాల్లో ఈ సమస్య ఉందని, వెంటనే అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. నిర్దేశిత గడువులోగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి టార్గెట్‌లు నిర్దేశించుకుని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇటీవల కాలంలో సుమారు 3 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించామని, ఉగాది నాటికి మరో 5 లక్షల గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. నిర్మాణ దశలోని గృహాలను జియో ట్యాగింగ్ చేసేందుకు మొబైల్ యాప్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రతి దశలో బిల్లు విడుదల, ఉగాది–2026 నాటికి ఇల్లు పూర్తి చేయడానికి లబ్ధిదారులకు తెలుగులో ఎస్‌ఎంఎస్ అలర్ట్ పంపుతున్నట్లు తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) 1.0 కింద 18,61,072 గృహాలు మంజూరు కాగా, ఇప్పటి వరకు 9.9 లక్షల గృహ నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. 5.69 లక్షల గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు.

వసతి గృహాల్లో వసతులకు రూ.13.10 కోట్లు

- కార్యదర్శి ఎస్ సత్యనారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
బిసి సంక్షేమ వసతి గృహాల్లో వసతుల కల్పనకు రూ.13.10 కోట్లు కేటాయించినట్లు ఆ శాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 397 వసతి గృహాల్లో సాధారణ, చిన్న మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. 332 వసతి గృహాల్లో పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఆర్‌ఒ ప్లాంట్లు, లివింగ్, డైనింగ్ రూమ్‌లు, కిటికీలకు, తలుపులకు దోమల నిరోధక వ్యవస్థలు ఉన్నాయని తెలిపారు.

750 మరుగుదొడ్ల పనులు ప్రారంభం

స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా 971 మరుగుదొడ్లు మంజూరవ్వగా, 750 మరుగుదొడ్ల పనులు ప్రారంభించినట్లు తెలిపారు. 214 పూర్తయినట్లు వెల్లడించారు. బాలికల వసతి గృహాల్లో సిసి కెమెరాలు అమర్చాల్సిన అవసరం ఉందన్నారు. 368 బాలికల వసతి గృహాల్లో 20 వసతి గృహాల్లోనే సిసి కెమెరాలు అమర్చినట్లు తెలిపారు. వచ్చే మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధనకు దృష్టి సారించాలన్నారు.

'ఉపాధి'ని అటకెక్కిస్తున్న కేంద్రం

- ఎపి గ్రామీణ ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అటకెక్కించే ప్రయత్నం కేంద్రం చేస్తోందని ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'విబి–జి రామ్ జి' బిల్లు వల్ల ఈ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎపిఒలు, ఇసిలకు భవిషత్తు అగమ్య గోచరంగా మారే అవకాశం ఉందని యూనియన్ గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి నర్సింహులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కూలీలతోపాటు ఎఫ్‌ఎలు, ఇతర ఉద్యోగులు వ్యతిరేకించాలని కోరారు. దేశంలోని కోట్లాది మంది పేదలకు, క్షేత్ర సహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్స్) ఇతర సిబ్బందికి జీవనోపాధిని కల్పించడమే కాకుండా, గ్రామీణ పేదలకు వలసల నివారణకు, పేద ప్రజలకు స్థిరమైన ఉపాధి వనరుగా ఉన్న పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని తెలిపారు. గత ఎనిమిదేళ్లుగా జీతాలు పెంచకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడంతో ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాలు కేవలం నెలకు రూ.5,700తో బతకలేక పస్తులతో గడుపుతున్నారని తెలిపారు. మరోవైపు వ్యవసాయ పనుల సీజన్ పేరుతో ఉపాధి పథకానికి హాలిడే ప్రకటించాలని కొత్త బిల్లులో పేర్కొనడం చూస్తుంటే వేతనదారులకు 100 రోజుల పని కూడా లేకుండా పోయే పరిస్థితి నెలకొందన్నారు.

సంక్రాంతి నాటికి 21 లక్షల పాస్ పుస్తకాలు పంపిణీ

- కలెక్టర్లకు ప్రైవేట్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దు అధికారం
- మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే చేసిన గ్రామాల్లో 2026 సంక్రాంతి నాటికి 21 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ఆయా భూ యజమానులకు పంపిణీ చేస్తామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రీ సర్వే 2.0ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నప్పటికీ 2 లక్షల వరకు జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాపింగ్ (జెఎల్‌ఎమ్) ఉన్నాయని, వాటిని త్వరితగతిన సబ్ డివిజన్ చేయించుకునేలా రైతులను, భూ యజమానులను చైతన్యవంతులను చేయాలని కలెక్టర్లకు ఆయన సూచించారు. సచివాలయంలో బుధవారం కలెక్టర్ల కాన్ఫరెన్స్ ప్రారంభ సమావేశంలో మంత్రి స్వాగతోపన్యాసం చేశారు. వివిధ శాఖల ద్వారా వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులను వారంలో ఒక్క సోమవారం మాత్రమే సేకరించేలా కాకుండా ప్రతిరోజూ ప్రజల నుంచి తీసుకునేలా ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలని, అంతేకాకుండా ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. భూముల రీ క్లాసిఫికేషన్‌పై దాదాపు లక్ష ఫిర్యాదులు వచ్చాయని, వాటన్నింటినీ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఇటీవల కాలంలో రెవెన్యూశాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, ఇప్పటికే ప్రభుత్వం భూముల అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగితే వాటిని రద్దు చేసే అధికారం కలెక్టర్లకు ఇచ్చామన్నారు. ప్రైవేటు భూముల అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసే అధికారం కూడా కలెక్టర్లకు ఇస్తూ త్వరలో మార్గదర్శకాలు విడుదల చేస్తామన్నారు. రాష్ట్ర ఆదాయం పెంపుదల కోసం వివిధ కంపెనీలు, ప్రాజెక్టులకు కేటాయించిన భూములు వినియోగం ఎలా ఉందో కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించారు. గత 18 నెలల కాలంలో రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించడం ఒక చరిత్ర అని, అది కూటమి ప్రభుత్వం సమిష్టి నాయకత్వంలోనే సాధ్యమైందని తెలిపారు. పెట్టుబడులను వెంటనే గ్రౌండ్ చేయించి యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు అందరమూ ఒక టీమ్‌గా కష్టపడాల్సి ఉందన్నారు. ప్రతి ఇంటికీ సంపద, సంక్షేమం చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలంతా ప్రభుత్వమంటే కలెక్టర్లే అనుకుంటారని, అందుకే అత్యంత జాగ్రత్తగా పాలన అందించాలని సూచించారు.

ఎజిఐసిఎల్ ఎమ్‌డిగా శ్రీనివాస్

- ప్రత్యేక ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యత అప్పగింత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాజధాని అమరావతి ప్రాంతంలో అభివృద్ధి పనులు, ప్రత్యేక ప్రాజెక్టులకు అవసరమైన డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్), నిర్వహణ వంటి బాధ్యతలను అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎజిఐసిఎల్)కు అప్పగించారు. ఈ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా మాజీ ఐఎఎస్ అధికారి సొంటి వెంకటరత్న శ్రీనివాస్‌ను నియమించారు. ఈ నెల 2న జరిగిన బోర్డు సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీనిపై బుధవారం నాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ విడుదల చేసిన ఈ జిఒలో కొత్తగా ఏర్పాటైన సంస్థ నిర్వహించనున్న బాధ్యతలు ఏమిటనేది పొందుపరిచారు. కంపెనీ చట్టం 2013 ప్రకారం ఏర్పాటుచేసిన ఎపిసిఆర్‌డిఎ మాస్టర్‌ప్లాను ఆధారంగా తయారయ్యే ప్రాజెక్టులకు డిపిఆర్‌లు తయారు చేయడం, ప్రాజెక్టులను అభివృద్ధి, అమలు ఈ కంపెనీకి చేయనుంది. ప్రైవేటు డెవలపర్ల నుంచి అభివృద్ధి రుసుములు వసూలు చేయడం, అద్దెలు, వినియోగ రుసుములు, సుంకాలు వసూలు చేయడంతోపాటు డెవలపర్లు, కాంట్రాక్టర్లు, ఆపరేటర్లనూ ఇక నుంచి ఎజిఐసిఎల్ నియమించనుంది. డైరెక్టర్ల బోర్డు ఆమోదంతో ప్రభుత్వ నిధులతోపాటు మార్కెట్ నుంచి అవసరమైన ఆర్థిక వనరులను సేకరించనుంది. వీటితోపాటు రవాణా, విద్యుత్, నీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, ఐసిటి వంటి సదుపాయాలు కల్పించేందుకు పిపిపి పద్ధతుల్లో నిర్వాహకులను ఎంపిక చేసే బాధ్యతనూ ఈ కంపెనీయే చేపట్టనుంది. బుధవారం శ్రీనివాస్ తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

స్మార్ట్ మీటర్లు బిగించేందుకు కుట్ర

- నోటీసులు వెనక్కి తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-విజయవాడ
ప్రతి ఇంటిలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల రూపంలో అదాని దోపిడీని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతోందని, ఆంధ్రప్రదేశ్‌ను అదానిప్రదేశ్‌గా సర్కార్ మారుస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు విమర్శించారు. విజయవాడలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్ కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని రెండు కోట్ల మంది వినియోగదారులకు బాగున్న మీటర్లు తొలగించి, స్మార్ట్ మీటర్లు బిగించడానికి ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. వీటి ద్వారా ప్రజలపై రూ. 25 వేల కోట్లు భారం మోపుతోందని వివరించారు. ప్రధాని మోడీ మెప్పుకోసం, అదాని సంస్థతో కుమ్మక్కై, రాష్ట్ర ప్రజలను బలి చేస్తోందన్నారు. ప్రజల అంగీకారం లేకుండా స్మార్ట్ మీటర్లు బిగించబోమని విద్యుత్ శాఖ మంత్రి హామీ ఇచ్చారని, నేడు మాట తప్పి బలవంతంగా మీటర్లు బిగిస్తున్నారని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించుకోకపోతే మూడు రోజుల్లో విద్యుత్ కనెక్షన్లు నిలిపివేస్తామని విజయవాడ నగరంలో విద్యుత్ అధికారులు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. దొడ్డిదారిన, మోసగించి, ప్రజల కళ్లుగప్పి మీటర్ల బిగింపునకు పూనుకుంటున్నారని విమర్శించారు. మీటర్ల రిపేరు సాకుతో స్మార్ట్ మీటర్లు బిగించడం మోసపూరితమన్నారు. కొత్తగా ఇచ్చే కనెక్షన్లకు, సోలార్ కనెక్షన్లకు బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగించడం శోచనీయమని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఇచ్చిన నోటీసులు రద్దు చేయాలని, పెట్టిన స్మార్ట్‌మీటర్లను తొలగించాలని, స్మార్ట్ మీటర్ల ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


పెన్షనర్ల దినోత్సవంలో ప్రసంగిస్తున్న గేయానంద్

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

- మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్
ఎన్నికల సందర్భంగా టిడిపి కూటమి ఇచ్చిన హామీ మేరకు పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. అనంతపురం లలిత కళాపరిషత్‌లో అఖిల భారత పెన్షనర్‌ల దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్‌ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్నగౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ.. పెన్షనర్లకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు వివిధ స్థాయిల్లో కృషి చేసిన ఉద్యోగులను ఉద్యోగ విరమణ తర్వాత ఆయా ప్రభుత్వాలు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దన్న గౌడ్, జయరామప్పలు మాట్లాడుతూ... గత ప్రభుత్వం పూర్తిగా పెన్షనర్లను నిర్లక్ష్యం చేసిందన్నారు. తాము అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం సైతం సమస్యల పరిష్కారంలో మీనమేషాలు వేస్తోందని తెలిపారు. పెన్షనర్‌ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. రాలిపోయే పండుటాకులకు ఇవ్వాల్సిన పెన్షన్లు, ఇతర సౌకర్యాలను రెండు, మూడు సంవత్సరాల తర్వాత ఇస్తామంటే ఏమి ప్రయోజనమని ప్రశ్నించారు. 2018 నుంచి ఇప్పటి వరకూ రావాల్సిన 11వ పిఆర్‌సి బకాయిలను వెంటనే విడుదల చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సకాలంలో ఇవ్వాలని, ఇహెచ్‌ఎస్ పథకం వైద్యసేవల పరిమితిని రూ.రెండు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్‌లకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రమణయ్య, సర్వజనాస్పత్రి అనస్థీసియా ప్రొఫెసర్ సుబ్రమణ్యం, పెన్షనర్లు పాల్గొన్నారు.

మారిన దొంగ



వీరాపురం గ్రామంలో జగ్గయ్య నివసించేవాడు. అతడు చిన్న చిన్న దొంగతనాలు చేసేవాడు. దొంగలించిన సొమ్ముతో జల్సాగా తిరిగేవాడు. స్నేహితులు ఎంత చెప్పినా వినేవాడు కాదు. ఇలా కాలం గడుపుతూ వచ్చాడు.

ఒక రోజు రాత్రి జగ్గయ్య దొంగతనానికి వెళ్ళాడు. ఒక ఇంటి తాళం పగులగొట్టి ఆ ఇంట్లో వున్న సొమ్మంతా దొంగలించాడు. జగ్గయ్య తను దొంగలించిన సొమ్మంతా ఒక పూరి గుడిసెలో ఎవరికీ తెలియకుండా దాచుకునేవాడు. ఇలా కొద్ది రోజులు జరిగి పోయింది. ఒకరోజు దగ్గరలో ఉన్న పొలం గట్టుకు పెట్టిన నిప్పు వలన ఊరికి అనుకుని వున్న గుడిసెలకు వ్యాపించాయి. ఖాళీ గుడిసెలు కావడంచేత ప్రాణ నష్టం జరగలేదు. కానీ ఆ గుడిసెల్లోనే జగ్గయ్య దొంగతనం చేసిన సొమ్ము దాచుకుంటున్న గుడిసె వుంది. అది పూర్తిగా కాలిపోయింది. అది చూసి జగ్గయ్య బోరున విలపించాడు. అప్పుడు జగ్గయ్య స్నేహితుడు రాము, జగ్గయ్య దగ్గరకు వచ్చి గట్టిగా నవ్వాడు. 'సొమ్ము పోగొట్టుకుని నేను బాధలో వుంటే నీకు నవ్వు వస్తోందా! ఇదేనా స్నేహమంటే' అన్నాడు జగ్గయ్య.


'ఓ మిత్రమా! దొంగలించిన సొమ్ము పోయినందుకే ఇంత బాధ పడుతున్నావే. ఆ సొమ్ము సంపాదించిన వారు ఇంకెంత బాధ పడి వుంటారో అర్థం చేసుకో ఆ బాధ, నొప్పి నీ వరకు వస్తేగాని నీకు అర్థం కాలేదు. ఇలా చేయడం తప్పు. ఈ దొంగతనాలు మానెయ్' అన్నాడు.

జగ్గయ్య బాగా ఆలోచించాడు. 'నన్ను క్షమించు రాముడు! ఇంకెప్పుడూ దొంగతనం చేయను. ఇంకొకరిని బాధ పెట్టను' అంటూ పశ్చాత్తాపం చెందాడు జగ్గయ్య.

– నరెద్దుల రాజారెడ్డి,
96660 16636.

జత చేయండి

పిల్లలూ, ఇక్కడ మొదటి వరుసలోని బొమ్మకు సరిపోయే బొమ్మ రెండో వరుసలో ఉంది. జత చేయండి చూద్దాం.



నేను గీసిన బొమ్మ





కారం సాత్విక్,
6వ తరగతి,
ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కోటరామచంద్రపురం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సమాజంలో మార్పు విద్యతోనే సాధ్యం

క్లాసు రూంలో పాఠాలు చెబుతున్న ఆ ప్రొఫెసర్.. ఆ తరగతి పిల్లలకి అధ్యాపకురాలు మాత్రమే కాదు.. వారిలో దాగున్న ఎన్నో ప్రశ్నలకి సమాధానం. సమాజం నుండి ఎంతో వివక్షని ఎదుర్కొన్న తను చెప్పే పాఠాలు ఆ పిల్లల మెదళ్లల్లో సమాజంలో తనలాంటి వాళ్లని చూసే చూపుని మారుస్తుంది. గౌరవాన్ని కలిగిస్తుంది. క్యాంపస్‌లో ఆమె వేసే ప్రతి అడుగులో చూస్తున్న వారికి, వింటున్న వారికి, గౌరవిస్తున్న వారికి ప్రతి ఒక్కరికీ ఆమె సాధించిన విజయం కనిపిస్తుంది. ఎందుకంటే ఆ ప్రొఫెసరమ్మ ట్రాన్స్‌జెండర్. తమిళనాడు లయోల కాలేజీలో ఈ ఏడాది జూన్ నుండి అసిస్టెంట్ ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమె పేరు డాక్టర్ ఎన్. జెన్సీ.



తమిళనాడు చరిత్రలో ఉన్నతవిద్యలో అర్హత సాధించిన, ఉన్నత కొలువు దీరిన మొట్టమొదటి ట్రాన్స్.. జెన్సీ. ఒకప్పుడు విద్యాలయం నుండి గెంటివేయబడిన తను ఈరోజు ఆ విద్యాలయంలోనే గౌరవమర్యాదలు పొందుతున్న హోదాలో ఉన్నారు. ఇంగ్లీష్ లిటరేచర్‌లో పిహెచ్‌డి చేసిన జెన్సీకి అధ్యాపక వృత్తి అంటే ఎనలేని ప్రేమ. పిల్లలని విద్యావంతులని చేసి, సమాజాన్ని చైతన్యం చేయాలన్న లక్ష్యం ఆమెది. విద్య తనలాంటి వారిని ఎంత అందలం ఎక్కిస్తుందో ఆమె నిరూపించలానుకున్నారు. అందుకే ఎన్నో కష్టనష్టాలు పడి, అవమానాలు ఎదుర్కొని మరీ డాక్టరేట్ సాధించారు. అయితే ఈ విజయం పట్ల ఆమె సంతోషంగా లేరు. ట్రాన్స్ వ్యక్తుల పట్ల సమాజం చూపే వివక్ష పోయినప్పుడే తనకి ఆనందమని ఆమె పదే పదే చెబుతారు.

'ఈ సమాజం ట్రాన్స్ వ్యక్తులని భిన్నంగా చూస్తుంది. ఇంటి నుండి గెంటేయాలని చెబుతుంది. కానీ ట్రాన్స్ వ్యక్తులని చదివించండి' అని ఆమె అంటారు. ప్రొఫెసర్‌గా ఉన్న ఆమె తనలాంటి వారి పట్ల సమాజం దృష్టికోణం మార్పించాలని నిరంతరం శ్రమిస్తున్నారు. టెడ్ స్పీకర్‌గా విద్యాసంస్థలు, సామాజిక వేదికలు, ప్రజా వేదికలలో 50కి పైగా ప్రేరణాత్మక ఉపన్యాసాలు ఇచ్చి సమాజంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

తన కమ్యూనిటీ వ్యక్తులు ఎదుర్కొనే పలు సమస్యలపై కూడా ఆమె పనిచేస్తున్నారు. సాధారణంగా ఏదేని గుర్తింపు పత్రాల్లో లింగనిర్ధారణ ముఖ్యంగా చేస్తారు. అయితే ట్రాన్స్ వ్యక్తులు మొదట ఉన్న గుర్తింపు తరువాతి కాలంలో మార్చుకోవాల్సి వస్తుంది. ఇది అంత సాధారణమైన ప్రక్రియ కాదు. ఎన్నో ఇబ్బందులు పడాలి. జెన్సీ ఆ సమస్యలను పరిష్కరించి కమ్యూనిటీ వ్యక్తులకి సాయం చేస్తున్నారు. అంతేకాదు, సామాజికంగా, విద్యాపరంగా ఎదుర్కొనే సమస్యలపై సలహాలు ఇస్తున్నారు. దీనిపై ఆమె ఇలా అన్నారు. 'ఈ ప్రయాణంలో నేను ఎన్నో ఇబ్బందులు పడ్డాను. పోరాడాను. నా తరువాత వచ్చేవారికి ఈ సమస్యలు పునరావృతం కాకూడదు. అందుకే సాయం చేస్తున్నాను'.

ప్రొఫెసర్‌గా, సామాజిక కార్యకర్తగా రెండు బృహత్తర బాధ్యతల్లో తలమునకలైన జెన్సీ ఈ ప్రయాణంలో ఎంత ముందుకు వెళ్లారంటే.. ఇటీవల పేదపిల్లలకి అవార్డు ప్రదానం చేస్తున్న ఓ జంట, ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెన్సీని పిలిచారు. అప్పుడు 'సమాజంలో ఈ మార్పు రావాలనే నా ప్రయత్నం. ఇది అన్ని చోట్లా రావాలి' అంటూ ఎంతో ఉద్వేగంగా మాట్లాడారు.

సమాజంలో ఇంతటి ప్రభావం చూపిస్తున్న జెన్సీ ఇప్పుడు తన కమ్యూనిటీకే కాదు. ఎంతోమందికి స్ఫూర్తిమంతంగా కనిపిస్తున్నారు. కాలేజీ క్యాంపస్‌లో విద్యార్థులు తనని పాఠాలు చెప్పే అధ్యాపకురాలిగానే కాదు, 'అంతకు మించిన వ్యక్తి' అని కొనియాడుతారు. 'ఆమె చూపించే ప్రభావం పాఠాలకి మించి ఉంటుంది' అంటారు. 'ఎన్నో సమస్యల అడ్డుగోడలని బద్దలు చేయగల ఏకైక సాధనం విద్య' అని ఆమె నిరూపించింది అని అభివర్ణిస్తారు.

చలికాలంలో పెరుగు తినొచ్చా?



చలికాలంలో గడ్డ పెరుగు తినడం మంచిదా కాదా అనే సందేహం చాలామందికి ఉంటుంది. గడ్డ పెరుగులో ప్రోటీన్, కాల్షియం, రిబోఫ్లావిన్, విటమిన్ బి6, విటమిన్ బి12 వంటి కీలక పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే చలికాలంలో చల్లగా ఉండే గడ్డ పెరుగును నేరుగా తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు, గొంతు ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా జలుబు, సైనసైటిస్ వంటి సమస్యలు ఉన్నవారు రాత్రి సమయంలో పెరుగు తినకుండా ఉండటం మంచిదని సూచిస్తున్నారు.

ఎలా తీసుకోవాలంటే..

- మధ్యాహ్న భోజన సమయంలో, గది ఉష్ణోగ్రతకు వచ్చిన తర్వాత తీసుకోవడం మంచిది.
- అలాగే కొద్దిగా మిరియాల పొడి, అల్లం, జీలకర్ర వంటి వేడి గుణాలు ఉన్న పదార్థాలను పెరుగులో కలిపి తీసుకోవాలి.
- సరైన మోతాదులో తీసుకోకపోతే కొంతమందికి సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- సరైన సమయంలో, సరైన విధంగా గడ్డ పెరుగు తీసుకుంటే చలికాలంలో కూడా దాని ఆరోగ్య ప్రయోజనాలను పూర్తిగా పొందవచ్చని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.

రంగవల్లులకు స్వాగతం!

సంక్రాంతి పండుగ హడావిడిలో ముగ్గులది ప్రత్యేక స్థానం. మరి ఇంకెందుకు ఆలస్యం? చకచకా ముగ్గులు వేసేయండి. 'జీవన' పాఠకులతో పంచుకోండి. తెల్ల కాగితంపై పెన్సిల్ లేదా బాల్‌పాయింట్ పెన్నుతో వేసిన ముగ్గులకు రంగులు నింపి పంపండి. అందరికీ అర్థమయ్యేలా నిలువు, అడ్డం చుక్కల వివరాలు కూడా పేర్కొనండి. మీ పేరు, చిరునామా, ఫొటో, ఫోన్ నెంబరు కచ్చితంగా పంపాలి. మెయిల్ ద్వారా పంపేవారు పూర్తి చిరునామా పంపాలి.

మా చిరునామా

రంగవల్లి

ప్రజాశక్తి దినపత్రిక, ప్రజాశక్తి భవనం, అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com, వాట్సాప్ : 83329 25496

శ్రామిక కళా సంబరాలు



నాటికను ప్రదర్శిస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి– గాజువాక, విశాఖ కలెక్టరేట్

సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలంటూ విశాఖలోని పెదగంట్యాడలో సిఐటియు జోన్ కమిటీ ఆధ్వర్యాన శ్రామిక కళా సంబరాలు నిర్వహించారు. సుమారు 50 మంది కళాకారులు అభ్యుదయ గీతాలను ఆలపించారు. సామాజిక చైతన్యం కల్పించే నాటికలను ప్రదర్శించారు. గురజాడ అప్పారావు రచించిన దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్.. నృత్య నాటికను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ప్రదర్శన ఇచ్చారు. మూఢనమ్మకాలపై సైన్స్ మేజిక్‌ను జన విజ్ఞాన వేదిక కడప జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు బాల బయ్యన్న ఆధ్వర్యాన ప్రదర్శించారు. మనిషి తలపై పాలు మరిగించే మేజిక్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. జెవివి నాయకులు ఎస్‌వికె.పరశురామ్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రామిక ఉత్సవ్ కార్టూన్ల ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

ఈ నెల 27 నుంచి జనవరి రెండు వరకు నిర్వహించే శ్రామిక ఉత్సవ్‌లో కార్టూన్ల ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. శ్రామిక ఉత్సవ్ కన్వీనర్ డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ... స్పాట్ కార్టూన్ల పోటీని ఈ నెల 21న ఉదయం పది గంటలకు విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలో పది సంవత్సరాల నుంచి 80 సంవత్సరాల వయస్సుగల కార్టూనిస్టులందరూ పాల్గొనవచ్చని తెలిపారు.

తిరుపతి యశోదనగర్‌లోని సిఐటియు కార్యాలయంలో శ్రామిక ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ.. డిసెంబర్ 19, 20, 21 తేదీలలో వినాయక సాగర్‌లో శ్రామిక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒంగోలులో హౌసింగ్ బోర్డ్, భాగ్యనగర్ కాలనీల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం మొండెంఖల్ గ్రామంలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ కర్నూలులో సమావేశం నిర్వహించారు.

టారిఫ్‌లను ఆయుధాలుగా మార్చారు

- మంత్రి సీతారామన్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : పలు దేశాలు టారిఫ్‌లు, ఇతర మార్గాలను ఆయుధంగా మార్చాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఈ పరిస్థితుల్లో భారత్ ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో బుధవారం టైమ్స్ నెట్‌వర్క్ నిర్వహించిన ఇండియా కాన్‌క్లేవ్ 2025లో మంత్రి సీతారమన్ మాట్లాడుతూ.. భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకుంటే అదే మనల్ని కాపాడుతుందన్నారు. భారత్‌ను ఒకప్పుడు టారిఫ్ కింగ్ అన్నవారే వాటిని ఆయుధంగా మలుచుకుంటున్నారని ప్రత్యక్షంగా అమెరికాను ఉద్దేశించి అన్నారు. యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఏడాది ఆగస్టులో భారత్‌పై 50 శాతం సుంకాలను విధించగా.. ఇటీవల ఆదే బాటలో మెక్సికో కూడా 50 శాతం టారిఫ్‌లను వేసిన విషయం తెలిసిందే.

వెండి ధగధగలు..

- తులం రూ.2,060

ముంబయి : దేశంలో పేదోడు బంగారంగా భావించే వెండి కూడా కొనలేని స్థాయికి ఎగిసింది. ఇటీవల వెండి ధరలు నూతన రికార్డ్‌లను సృష్టిస్తున్నాయి. బుధవారం కిలో వెండి ధర ఏకంగా రూ.2,00,000 మార్కును తాకింది. ఇంతక్రితం రోజుతో పోలిస్తే ఒక్క రోజులోనే కిలోపై రూ.9,000 పెరగడం గమనార్హం. జిఎస్‌టి 3 శాతం కలిపితే రూ.2.06 లక్షలకు చేరింది. దీంతో 10 గ్రాములు లేదా తులం ధర రూ.2,060కి చేరినట్లయ్యింది. అంతర్జాతీయంగా స్పాట్ వెండి ధర 2.8 శాతం పెరిగి ఔన్సుకు 65.53 డాలర్ల రికార్డు స్థాయికి చేరుకుంది. వెండి ధర 65 డాలర్లను దాటడం చరిత్రలో ఇదే తొలిసారి. అమెరికా డాలర్ బలహీనపడటంతో బంగారం ధర కూడా 0.4 శాతం పెరిగి ఔన్సుకు 4,321 డాలర్లకు చేరింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.650 పెరిగి రూ.1,34,660గా పలికింది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.600 ప్రియమై రూ.1,23,450కి చేరింది.

వెండికి పారిశ్రామిక రంగంలో భారీగా డిమాండ్ పెరగడంతో ఈ లోహం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ముఖ్యంగా విద్యుత్ వాహనాలు, సౌర శక్తి, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో వెండిని విరివిగా ఉపయోగిస్తున్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా వెండి సరఫరా లేకపోవడం వల్ల ధరలు ఒక్కసారిగా దూసుకుపోయాయి. భవిష్యత్తులోనూ చిన్నపాటి హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ వెండి ధరలు బలంగానే కొనసాగే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న శైలజ

పోక్సో చట్టంపై అవగాహనుండాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

ప్రజాశక్తి– ఎచ్చెర్ల (శ్రీకాకుళం జిల్లా)

పోక్సో చట్టంపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. లైంగిక వేధింపుల చట్టాలపై విద్యార్థినులకు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ఎస్ఎం.పురంలోని ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో బుధవారం అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఆచరించాల్సిన విధానంపై వివరించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ విద్యార్థినులు భయంతో ఉండకూడదని, ఇబ్బందులు ఉన్న సమయంలోనూ ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. లైంగిక వేధింపులపై మహిళా కమిషన్ తరఫున తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం క్యాంపస్‌ను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పరిస్థితులను పరిశీలించారు. కార్యక్రమంలో ఉన్నత విద్య చైర్మన్, ఛాన్సలర్ ప్రొఫెసర్ కొత్తా మధుమూర్తి, డైరెక్టర్ కె.బాలాజీ, పరిపాలనాధికారి డాక్టర్ రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ పాల్గొన్నారు. పొందూరు కెజిబివిని కూడా శైలజ సందర్శించారు.

'విబి-జి రామ్ జి' బిల్లుకు వ్యతిరేకంగా
20న శ్రమజీవుల నిరసనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్చడంతోపాటు చట్టంలో అనేక మార్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్-గ్యారంటీ రోజ్‌గార్ అజివికా మిషన్ (గ్రామీణ్) బిల్లును ఉపసంహరించుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక, కౌలు రైతు, రైతు సంఘాలు, సిఐటియు డిమాండ్ చేశాయి. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కొత్త బిల్లును ఉపసంహరించుకోవాలని నాలుగు సంఘాల ఆధ్వర్యాన ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియజేయనున్నట్లు వెల్లడించారు.

ఈ పథకంలో రాష్ట్రాల వాటాను 10 నుంచి 40 శాతానికి పెంచడం వల్ల ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాలకు ఇబ్బందులు తప్పవన్నారు. టిడిపి, జనసేన ఎంపిలు ఈ బిల్లును వ్యతిరేకించాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చారని పేర్కొన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ బిల్లును ఆమోదించడం గ్రామీణ పేదలకు అన్యాయం చేయడమేనన్నారు. 20న జరిగే నిరసనల్లో కార్మిక సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రూ.లక్షల కోట్లు కార్పొరేట్లకు దోచిపెడుతున్న ప్రభుత్వం.. పేదలకు అన్యాయం చేస్తోందన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రల్లో ఇది చివరి దశ అని పేర్కొన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ.. కేంద్రం తెచ్చిన కొత్త బిల్లును కౌలు రైతు సంఘం వ్యతిరేకిస్తోందన్నారు. గత చట్టంలో వేతనదారులకు మేలు చేసే అంశాలన్నింటినీ కొత్తగా తెచ్చిన బిల్లులో తొలగించారని తెలిపారు. మహాత్మా గాంధీ చరిత్రను రూపుమాపడం బిజెపి వల్ల కాదన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

పేదలపై క్రూర దాడి

పని పొందడాన్ని హక్కుగా మార్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పక్కన పెట్టాలని నిర్ణయించడం పేదలపై కేంద్ర ప్రభుత్వం చేసిన క్రూర దాడి. దాని స్థానంలో పరిమిత నిధులతో అరకొరగా ఉపాధి కల్పించడానికి అవకాశం కల్పించే వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) (విబిజి-ఆర్‌ఎఎంజి) అనే కొత్త పథకాన్ని అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య దీనికి సంబంధించిన బిల్లును కూడా లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కేంద్రం ప్రతిపాదించిన ఈ కొత్తబిల్లు ఉపాధి పొందడం హక్కు అనే భావనను పూర్తిగా తుడిచి పెట్టేస్తుంది. చట్టాన్ని పథకంగా పరిమితం చేయడం ద్వారా ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై పేదలను ఆధారపడేలా చేస్తుంది. ఇప్పటి వరకు కూలీల డిమాండ్‌బట్టి ఉపాధిని కల్పించే విధానాన్ని మార్చివేసి స్థానికంగా అవసరం ఉంటేనే పనులు కేటాయించే పద్ధతిని అమలు చేయనున్నారు. చట్టానికి ఇప్పటిదాకా ఉన్న మహాత్మాగాంధీ పేరును కూడా నూతన బిల్లు తొలగిస్తుంది. నిధుల కోసం రాష్ట్రాలను మరింతగా కేంద్రంపై ఆధారపడేలా చేస్తుంది. తద్వారా, పేదలకు పెనుభారంగా మారుతున్న ఉదారవాద ఆర్థిక సంస్కరణల ఎజెండాను మరింతగా ముందుకు తీసుకుపోవడానికి కేంద్ర ప్రభుత్వానికి అవకాశం దొరుకుతుంది.

వామపక్షాల మద్దతుతో దేశాన్ని పాలించిన తొలి యుపిఎ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించింది. సార్వత్రిక ఉపాధి హక్కును సాధించాలనే లక్ష్యంతో ఈ చట్టాన్ని అప్పటి ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. ఈ చట్టం అమలు గ్రామాల ఆర్థిక, సామాజిక స్థాయిల్లో ఆశ్చర్యకరమైన మార్పును తీసుకువచ్చింది. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారమే గ్రామీణాభివద్ధికి ఇది గొప్పగా దోహదపడింది. గ్రామీణ నిరుద్యోగానికి కొంతవరకు పరిష్కారంగా నిలిచింది. దీని ద్వారా లభించిన పనుల్లో దేశ వ్యాప్తంగా 50 నుండి 60 శాతం వరకు మహిళలే పాల్గొన్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఇది వారి సాధికారతకు మార్గం వేసింది. ఉపాధి కోసం నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి నుంచి గ్రామీణులను కొంత మేరకు కాపాడింది. కరువు కాటకాలు విరుచుకుపడినప్పుడు అండగా నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లో, వ్యవసాయ పనుల్లో కూలీ రేట్లకు స్థిరత్వాన్ని తీసుకువచ్చింది. అనేక రాష్ట్రాల్లో 'ఉపాధి' పనుల ద్వారా నీటి పారుదల సౌకర్యాలు కల్పించారని, చెరువులు, బావులు, రోడ్లు నిర్మించారని నివేదికలు చెబుతున్నాయి. ఇంత విస్తృతంగా, బహుముఖంగా క్షేత్ర స్థాయిలో పేద ప్రజలకు ఉపయోగపడిన చట్టం మరొకటి లేదని చెప్పవచ్చు. బిజెపి అనుసరించే భూస్వామ్య, పెట్టుబడిదారీ, మతవాద రాజకీయ ఎజెండాకు ఇది భిన్నం! మహాత్మా గాంధీ పేరు కూడా వారికి తీవ్ర అసహనాన్ని కలిగించింది. అందుకే, అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ చట్టాన్ని నీరుగార్చే కుట్రలు ఎన్నో చేశారు. నిధులు కోత పెట్టడంతోపాటు, చేసిన పనికి కూలీ ఇవ్వకపోవడం, అనేక ఆంక్షలు విధించడం వంటి చర్యలకు దిగారు.

చివరకు ఉపాధి హామీ చట్టం లక్ష్యాన్నే ధ్వంసం చేస్తూ, దానితో ఏ మాత్రం పోలిక లేని 'విబిజి-ఆర్‌ఎఎంజి'ని రూపొందించారు. దీని ద్వారా చట్టం అమలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువస్తున్నారు. బిల్లులో పేర్కొన్న అంశాల ప్రకారం ప్రస్తుతం రాష్ట్రాల వాటా ఉన్న 10 శాతం మొత్తాన్ని 40 శాతానికి పెంచనున్నారు. ఈ ఒక్క చర్య వల్లే మన రాష్ట్రంపై నాలుగువేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందని అంచనా! ఇది 11 కోట్ల మంది కూలీల ఉపాధికి గండి కొడుతుంది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలకు ఎంత నిధి ఇవ్వాలన్నది కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. కేటాయింపును మించి ఖర్చు చేస్తే (పేదలకు పనులు కల్పిస్తే) ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. అదే విధంగా ఉపాధి కల్పించలేకపోతే పరిహారాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లించాలి! దీని అర్థం నిధులు సమకూర్చే బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం చట్టపరంగా తప్పుకోవడమే! వ్యవసాయ పనుల కాలంలో 60 రోజుల వరకు ఉపాధి పనులను నిలిపివేయవచ్చని బిల్లులో పేర్కొనడం, కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసే రంగాల్లోనే పథకం అమలవ్వాలనే నిబంధన విధించడం ఎవరికి మేలు చేస్తుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. 100 రోజుల ఉపాధిని 125 రోజులకు పెంచుతున్నట్లు పేర్కొనడం కూడా కేవలం ప్రచారానికే తప్ప ఆచరణలోకి రాదు. ఈ నేపథ్యంలో పేద ప్రజలకు అన్ని విధాల హాని చేసే కేంద్ర ప్రభుత్వ చర్యను ప్రతిఘటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

మహనీయుల మాట



ఈ దేశం, సమాజం మగవాళ్ల గుత్త సొత్తుగా భావిస్తున్నారు. అది తప్పు. మగవాళ్లు ఇప్పటి దాకా స్త్రీలకు చెందాల్సినదంతా హరించి వేస్తూనే వచ్చారు.

- ముజఫర్ అహ్మద్,
తొలి తరం కమ్యూనిస్టు

విశ్లేషణ

ఆదివాసీ హక్కుల రక్షణ... రాజ్యాంగ స్ఫూర్తి



న్యాయపరమైన వ్యాఖ్యానాలు మారుతున్న సమయంలో, షెడ్యూల్డ్ ప్రాంత స్వయంప్రతిపత్తి క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో, 5వ షెడ్యూల్ నియమాలను బలోపేతం చేయడం అత్యవసరం. సాధారణ చట్టాలు షెడ్యూల్డ్ ప్రాంత అమలు విషయంలో వాస్తవంగా ప్రభావవంతంగా ఉండేలా అవసరమైతే స్పష్టమైన రాజ్యాంగ సవరణలు చేయాలి. ఐదో షెడ్యూల్ నిజంగా న్యాయం, స్వీయ నిర్ణయం, సాంస్కృతిక పరిరక్షణకు సాధనంగా ఉండాలంటే, ప్రభుత్వాలు తమ ఆదివాసీ పౌరుల పట్ల ఉన్న రాజ్యాంగ అమలు సంసిద్ధత, కట్టుబాటును పునరుద్ధరించుకోవాలి.

భారత రాజ్యాంగంలో ఆదివాసీ ప్రాంత పాలనకు ప్రత్యేక స్థానం ఉంది. దేశంలోని వైవిధ్యాన్ని గౌరవిస్తూ, సమానత్వాన్ని న్యాయంగా అమలు చేయాలనే సంకల్పంతో ప్రజాస్వామ్యంలో చేసిన అత్యంత సున్నితమైన ప్రయోగాలలో రాజ్యాంగం ఐదో షెడ్యూల్ ఒకటి. ఆదివాసీ సమాజాల ప్రత్యేక సామాజిక-సాంస్కృతిక స్వరూపాన్ని గుర్తించిన రాజ్యాంగం, వారి హక్కుల రక్షణ కోసం ప్రత్యేక నియమాలను రూపొందించింది.

ఆర్టికల్ 244(1) మరియు ఐదో షెడ్యూల్ ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతాలకు ప్రత్యేక పాలనా వ్యవస్థ ఏర్పాటయింది. సమానత్వం అంటే అందరికీ ఒకే విధమైన చట్టాలు వర్తింపజేయడం కాదని, న్యాయం సాధించాలంటే భిన్నమైన పరిస్థితులకు భిన్నమైన రక్షణ అవసరమని రాజ్యాంగం గుర్తిస్తుంది. అయితే రాజ్యాంగ పరిరక్షణ నియమాల లక్ష్యం నేపథ్యంలో ఒక కీలక ప్రశ్న లేవనెత్తుతోంది. ఆదివాసీల హక్కులను కాపాడేందుకు రూపొందించిన ఐదో షెడ్యూల్ తన లక్ష్యాన్ని నిజంగా సాధిస్తున్నదా?



డా॥ పల్లా త్రినాథరావు

2011 జనగణన ప్రకారం భారతదేశంలో షెడ్యూల్డ్ తెగల జనాభా సుమారు 10.4 కోట్లుగా ఉంది. ఇది దేశ జనాభాలో 8.6 శాతం. ఐదో షెడ్యూల్ కింద ప్రకటించిన షెడ్యూల్డ్ ఏరియాలు దేశ భూభాగంలో సుమారు 11.3 శాతం విస్తీర్ణంలో ఉన్నాయి. ఇవి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. అయితే మొత్తం ఆదివాసీ జనాభాలో కేవలం 41 శాతం మాత్రమే ఈ షెడ్యూల్డ్ ప్రాంతాలలో నివసిస్తుండగా, మిగిలిన 59 శాతం ఐదో షెడ్యూల్ రక్షణ పరిధికి బయట ఉన్నారు.

నెహ్రూ పంచశీల సూత్రం

1958లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపాదించిన 'ఆదివాసీ పంచశీల సూత్రం' అభివృద్ధి పేరుతో ఆదివాసీలను ప్రధాన స్రవంతిలో బలవంతంగా కలిపివేయాలనే విలీన భావనను ఆయన తిరస్కరించారు. ఆదివాసీల సంస్కృతి, జీవన విధానం, స్వయంపాలనను గౌరవిస్తూ అభివృద్ధి జరగాలని నెహ్రూ స్పష్టం చేశారు. బయటి వారి జోక్యం తగ్గించి, అవసరమైన చోట సాంకేతిక సహాయం మాత్రమే అందించాలన్నది ఆయన దృష్టి కోణం. అంటే ఆదివాసీలే తమ ప్రాంత పాలనలో ప్రధాన పాత్ర పోషించాలి. వారి అభివృద్ధిని వారే నిర్దేశించుకోవాలి.

గవర్నర్ అధికారాలు-రాజ్యాంగ ఉద్దేశం

అవసరమనుకుంటే ఆదివాసీల హక్కుల రక్షణకు గవర్నర్ ఒక నోటిఫికేషన్ ద్వారా ఐదో షెడ్యూల్ పేరా 5(1) ప్రకారం, కేంద్ర లేదా రాష్ట్ర చట్టాలు షెడ్యూల్డ్ ఏరియాలకు వర్తించకూడదని లేదా మార్పులతో వర్తించాలని నిర్ణయించవచ్చు. అవసరమైతే అ మార్పులను చట్టాల అమలులోకి రాక మునుపు కాలానికి కూడా వర్తింపజేయవచ్చు. ఆ అధికారం ఆదివాసీ ప్రయోజనాలకు హానికరమైన చట్టాల నుంచి రక్షణ కల్పించే శక్తివంతమైన సాధనం.

అలాగే పేరా 5(2) కింద 'శాంతి, మంచి ప్రభుత్వ పాలన' కోసం షెడ్యూల్డ్ ఆదివాసీ భూమి బదలాయింపులు, వడ్డీ వ్యాపారం, సామాజిక నియంత్రణ వంటి అంశాలపై గవర్నర్ నిబంధనలు రూపొందించ వచ్చు. గిరిజన సలహా మండలి సిఫార్సులు, రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత ఇవి చట్టబద్ధత సంతరించు కుంటాయి.

న్యాయవ్యవస్థ పాత్ర

గత కొన్ని దశాబ్దాలుగా భారత దేశ న్యాయస్థానాలు ఐదో షెడ్యూల్‌ను విశ్లేషిస్తూ, దాని రక్షణాత్మక ఆత్మను, రాజ్యాంగ పరిమితులను స్పష్టత చేయడంలో కీలక పాత్ర పోషించాయి. సమత వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మధ్య నడిచిన కేసులో (1997) షెడ్యూల్డ్ ప్రాంతాలలో గవర్నర్‌కు అసాధారణమైన రాజ్యాంగ పాత్ర ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆర్టికల్ 154, 163 కింద మంత్రివర్గ సలహాకు లోబడి కాకుండా, స్వతంత్రంగా వ్యవహరించి ఆదివాసీ హక్కులను రక్షించాల్సిన బాధ్యత గవర్నర్‌పై ఉందని తీర్పు చెప్పింది. గవర్నర్ కేవలం సంతకం చేసే అధికారి కాదని, ఆదివాసీ హక్కుల రక్షకుడని పేర్కొంది.

అలాగే పి.రామిరెడ్డి కేసు (1988)లో ఆదివాసీ భూ పరాయీకరణ నిరోధించడానికి 1/70 రెగ్యులేషన్ వంటి కఠిన ఆంక్షలు రాజ్యాంగబద్ధమేనని ధృవీకరించింది. ఇది పేరా 5(2) కింద గవర్నర్ శాసనాధికారాన్ని ధృవీకరించింది. రాష్ట్ర షెడ్యూల్డ్ ప్రాంతాలలో గిరిజనేతరుల పేర భూ బదలాయింపులు 1/70 రెగ్యులేషన్ నిషేధిస్తుంది. అంటే ఆదివాసీలు, గిరిజనేతరుల మధ్య అలాగే గిరిజనేతరుల మధ్య భూ బదలాయింపులు కూడా చెల్లవు. 1/70 రెగ్యులేషన్ అమలు విషయంలో ప్రభుత్వాన్ని కూడా గిరిజనేతరులు గానే భావించాలని సుప్రీంకోర్టు సమత కేసులో పేర్కొంది.

అదే విధంగా, అమరేంద్ర ప్రతాప్ సింగ్ వర్సెస్ తేజ్ బహదూర్ ప్రజాపతి (2003) కేసులో, ఆదివాసీ భూములపై అనాదరణ స్వాధీనం ద్వారా గిరిజనేతరులు హక్కు సంపాదించలేరని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. సాధారణ చట్ట సూత్రాలు రాజ్యాంగ రక్షణలను అధిగమించలేవని స్పష్టం చేసింది.

బాల్కో ఉద్యోగుల సంఘం వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2002) కేసులో కూడా, ఆదివాసీలకు అనుకూలమైన రిజర్వేషన్లు వంటి రక్షణాత్మక చర్యలు సమానత్వ సూత్రానికి విరుద్ధం కాదని, ఆర్టికల్ 15(4), 46 కింద అవి సమర్ధనీయమని సుప్రీంకోర్టు పేర్కొంది.

అయితే వాస్తవానికి షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీ ప్రయోజనాలకు రాష్ట్ర, కేంద్ర చట్టాలు అనుకూలంగా లేదా భిన్నంగా ఉన్నాయా అనేది ముందుగా పరిశీలించే సమర్థవంతమైన వ్యవస్థ చాలా రాష్ట్రాల గవర్నర్ కార్యాలయాల్లో లేదు. ఫలితంగా సాధారణ చట్టాలు యథేచ్ఛగా ఈ ప్రాంతాలకు వర్తించి ఆదివాసీ రక్షణ కోసం ఉద్దేశించిన రాజ్యాంగ ప్రత్యేక రక్షణలు క్రమంగా బలహీనపడుతున్నాయి.

గత న్యాయ స్థానాల భావజాలం, ఆదివాసీ హక్కుల రక్షణ విషయంలో చూసే కోణంతో పోలిస్తే ప్రస్తుత న్యాయస్థానాల ఆలోచన, తీర్పుల స్వభావంలో చాలా మార్పు కనిపిస్తున్నది. దానివల్ల ఆదివాసీ హక్కుల పరిరక్షణ మరింత జటిలమవుతున్నది.

తాజా న్యాయ ధోరణులు-కొత్త సవాళ్లు

చేబ్రోలు లీలా ప్రసాద్‌రావు వర్సెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం (2020) కేసులో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసీలకు 100 శాతం ఉపాధ్యాయ పోస్టుల రిజర్వేషన్‌ను రద్దు చేసింది. గవర్నర్ అధికారాలు ప్రత్యేకమైనవే అయినప్పటికీ...అవి రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాలు, రిజర్వేషన్ పరిమితులకు లోబడి ఉండాలన్నది కోర్టు అభిప్రాయం.

ఈ తీర్పు ప్రాథమిక హక్కుల ప్రాధాన్యతను సూచించినప్పటికీ, అనుకోని ప్రతికూల తీవ్ర ప్రభావాలను ఆదివాసీ జీవనం, ఉనికిపై కలిగించింది. దానివల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో షెడ్యూల్డ్ ఏరియాల్లో వేలాది స్థానిక ఆదివాసీ ఉపాధ్యాయ, ఇతర ప్రభుత్వ నియామకాలకు ఆటంకం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్‌లోనే ఐదో షెడ్యూల్ పేరా 5(1) కింద గవర్నర్ జారీ చేసిన సుమారు 23 నోటిఫికేషన్ల ద్వారా 4,626 ఉపాధ్యాయ పోస్టులు స్థానిక ఆదివాసీలతో గతంలో భర్తీ అయ్యాయి. ఇక పేరా 5(1) కింద గవర్నర్ ఆదివాసీల ఉద్యోగ నియామక విషయంలో నోటిఫికేషన్ ఇవ్వలేరు. ఆ తీర్పు ప్రభావం ఇతర రాష్ట్ర షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీ నియామకాలపై పెద్ద ఎత్తున ప్రభావం చూపింది.

ఈ దృక్కోణాన్ని ఆదివాసీ సామాజిక, మానవ హక్కుల రక్షణ సంస్థ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య నడిచిన (2023) కేసులో సుప్రీంకోర్టు మళ్లీ ధృవీకరించింది. ఐదో షెడ్యూల్ ఆదివాసీ హక్కుల రక్షణ కోసం మాత్రమేనని గిరిజనేతరుల హక్కులను విస్మరించడానికి కోసం కాదని కోర్టు పేర్కొంది.

ఐదవ షెడ్యూల్ రాజ్యాంగ రక్షణ మూలాలు 1935 భారత ప్రభుత్వ చట్టంలో ఉన్నాయి. సాధారణ పాలన విషయంలో ఆ చట్టం ఇతర ప్రాంతాల నుంచి 'పూర్తిగా లేదా పాక్షిక మినహాయింపు ప్రాంతాలుగా ప్రకటించింది. సెక్షన్ 92(1) ప్రకారం, గవర్నర్ ప్రత్యేకంగా అనుమతించనంత వరకు కేంద్ర, ప్రావిన్షియల్ చట్టాలు ఈ ప్రాంతాలకు అవి నేరుగా వర్తించేవి కావు. బ్రిటిష్ కాలంలో ప్రకటించిన పాక్షిక మినహాయింపు ప్రాంతాలనే స్వతంత్రం వచ్చిన తర్వాత రాజ్యాంగం ఐదో షెడ్యూల్‌లో చేర్చారు. సాధారణ చట్టాల అమలును నియంత్రిస్తూ ప్రత్యేకంగా గవర్నర్ నోటిఫికేషన్ ఐదో షెడ్యూల్ కింద జారీ చేసేంత వరకూ అవి అమలులోనే ఉంటాయని కోర్టు తీర్పులు ఉన్నాయి. బ్రిటిష్ కాలంనాటి ఏజెన్సీ ప్రాంత ప్రత్యేక పాలనా లక్ష్యానికి ప్రస్తుత కోర్టు తీర్పులు విరుద్ధం.

పాలనాధికారులు, విధాన నిర్ణేతల దృష్టిలో ఐదో షెడ్యూల్ ఒక గతకాలపు అవశేషం కాదు. అది ఇప్పటికీ జీవించే రాజ్యాంగ సాధనం. ఇది గిరిజన, గిరిజనేతరుల వేర్పాటు కోసం కాదు. ఆదివాసీ స్వయంపాలన, సంస్కృతి, సంప్రదాయ చట్టాలను గౌరవిస్తూ పాలన జరగాలన్న దృష్టికోణాన్ని ప్రతిపాదిస్తుంది. ఆదివాసీ అటవీ హక్కులు, వారి భూ పరాయీకరణ నియంత్రణ, చిన్న అటవీ ఉత్పత్తుల యాజమాన్యం, షెడ్యూల్డ్ ప్రాంత పంచాయతీ విస్తరణ (పీసా) చట్టం కింద ఆదివాసీ స్వీయ స్థానిక పాలన వంటి విధానాలు అన్నీ ఈ రాజ్యాంగ ధర్మకర్తవ్య భావనతోనే అమలు కావాలి.

న్యాయపరమైన వ్యాఖ్యానాలు మారుతున్న సమయంలో, షెడ్యూల్డ్ ప్రాంత స్వయంప్రతిపత్తి క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో, 5వ షెడ్యూల్ నియమాలను బలోపేతం చేయడం అత్యవసరం. సాధారణ చట్టాలు షెడ్యూల్డ్ ప్రాంత అమలు విషయంలో వాస్తవంగా ప్రభావవంతంగా ఉండేలా అవసరమైతే స్పష్టమైన రాజ్యాంగ సవరణలు చేయాలి. ఐదో షెడ్యూల్ నిజంగా న్యాయం, స్వీయ నిర్ణయం, సాంస్కృతిక పరిరక్షణకు సాధనంగా ఉండాలంటే, ప్రభుత్వాలు తమ ఆదివాసీ పౌరుల పట్ల ఉన్న రాజ్యాంగ అమలు సంసిద్ధత, కట్టుబాటును పునరుద్ధరించుకోవాలి.

సమత కేసు (1997)లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి కె.రామస్వామి పేర్కొన్నట్లుగా షెడ్యూల్డ్ ప్రాంతాల్లో రాజ్యాంగం మార్కెట్ ఆర్థిక వ్యవస్థను ఊహించలేదు. అది న్యాయంపై ఆధారపడిన నైతిక ఆర్థిక వ్యవస్థను ఊహించింది. ఆయన పేర్కొన్నట్లు ఆచరణ సాగితే అక్కడ ఆదివాసీ హక్కుల రక్షణ, భాగస్వామ్యం, బాధ్యతలు కలిసి, వైవిధ్యంలో సమానత్వం అనే రాజ్యాంగ హామీకి నిజమైన అర్థం ఇస్తాయి.

/ వ్యాసకర్త సెల్: 9618296682 /

సెటైర్

'నిషా'క పట్నం!

"ఇంట్లోక మాట! ఇల్లాకత్తల ఒక మాట!?.. లోపలోడు లోభి...బయటోడు భోగీ! ఎవులేటనుకుంతే ఏటి! మనోడు నికార్సయిన ఇసాపట్నం ఇసక దిబ్బ..అనకాపల్లి బెల్లం కురిడి.. నరిసీపట్నం నాటు సారా కుండ! ఎలాగా, పరదేశి నాయుడు ఒళ్ళు మరిచి, గ్లాసు వదిలేసి, గంతు లేస్తుంటే..దసుమంతు నాయుడుకి చిరాకొచ్చింది.

"ఏంట్రా! రెండు పెగ్గులకే తైతక్కలా! లేప్పోతే..నా దగ్గిరికి రాకముందే..బెల్ట్ షాపు దగ్గిరో..పర్మిట్ రూంలో కొట్టీసొచ్చినావేటి?"

ఎదురుగా పరదేశి కూర్చున్న కుర్చీని లాగిపెట్టి తన్నాడు దసుమంతు నాయుడు. అది, అధినాయకుడి ఫోటో దగ్గరకు తుళ్ళిపడింది.

పరదేశి అవాక్కయ్యాడు.. బోడిగుండు బంగారం కొట్టోడు చెప్పినట్టుగా!

"ఈ దసుమంతు నాయుడి పాదాల దగ్గర హనుమంత లాగా ఉండాలి తప్ప, కల్లు తాగిన కోతి గెంతులెయ్యకూడదు.. సిరాకొస్తే..పరవాడ కంపు గొడౌన్ల మధ్య పడేత్తాను..మరి!"

"సెమించన్నా! నువ్వు అన్న ఆ సివరి మాటకే సెమటెక్కిపోయింది."

"అసలు, నీ కుప్పి గెంతులకి కారణమేటో సెప్పు"

"సెప్తాను గానీ.. నీకోసం దుప్పి మాంసం వేపుడు తెచ్చాను..తినన్నా.. తింటూ.. తిట్టు.. మందు కొడుతూ.. కొట్టు!"- పరదేశి పొట్లం విప్పి ప్లేట్లో పెట్టాడు.

"దుప్పి ఎక్కడ దొరికింది రా!"- రెండు ముక్కలు నమిలి.. కొన్ని చుక్కలు నోట్లో ఒంపుకున్నాడు.

"అన్నా! ఆ లాటరయిట్ పేరుతో బాక్సయిట్ తవ్వుకోవడానికి, ఆ గోదావరోడి బినామీకి అడివిచ్చేసినాం గదా! ఆడు, అడివిని నరుకుతూ, దాన్లో బతుకుతున్న దుప్పులూ, పందులూ, సెమల పిల్లల్ని ఏటాడుకుంటున్నాడు. అప్పుడప్పుడు, మనకి మాంసాలు పంపిత్తున్నాడు."

"మన ఇళ్లల్లో, హోటేల్లలో, లాడ్జిల్లో ఇలాగా వండరేట్రా? గొప్ప రుసికరంగా ఉంది దుప్పి"

"అన్నా! రోడ్ల పక్క..లోపల తోటల్లో.. జాగాలు ఇచ్చేసినాము గదా! అక్కడ డాబాలు లెగిసిపోయినాయి.. నీ మనుసు గొప్పది.. గంగ రేవంత.. గాజువాక కొండంత.. ఆరిలోవంత!"



"అప్పుడప్పుడు కోపం తెప్పిత్తున్నావు గానీ, మనుసుకి నచ్చిన మాటలు సెప్తావురా.. ఎదవ.. నా దగ్గిర ఉండాల్సినోడివి కాదురా!"

"అన్నా! మనం ఈ పాలేల్లోన.. ఈ కుడితి గోలేల దగ్గిర ఉండొద్దన్నా! ఇసాకపట్నం ఎలిపోదుం"

"ఎందుకురా! ఇక్కడ మనకేటి తక్కువైందని? ఏదో పేరుతో మైనింగ్ అవుతుంది. మనకి డబ్బులొత్తన్నాయి. ఎవలెవలలో గెడ్డలకి అడ్డంగా డాములు కట్టేత్తారట!.. కడితే, ఆళ్లూ ఇత్తారు.. నాటు మాంసాలు.. కావలసిన మందు.. కారుకి ఆయిలు.. నీలాగా నమ్మకమైనోళ్ళకి నెల నెలా ఇంట్లో కూకోబెట్టి జీతాల కవర్లు..ఎవులు ఎమ్మెల్యే, ఎంపీ అయినా..మన కోటా మనకిచ్చేత్తారు.. మైనింగోలు.. ఎక్సయిజోలు.. రివిన్యోలు.. పోలీసోలు.. అందరూ మనోలే! ఇంకేటి లోటు? హాయిగా.. కాలు మీద కాలేసుకొని.. కాలు ముందు బల్లేసుకుని.. బల్లమీద అన్నీ సర్దేసుకుని.. అలగలగా.. సరదాగా జీవితం గడిసిపోద్ది గదా!"

"అన్నా! ఇవన్నీ అనుభవించేత్తున్నాము.. అడివిలోకి సముద్రం రాదు గదా!?"

దసుమంతు నాయుడి మూతికి అంటిన దుప్పి మాంసం ఇగురంతా, పరదేశి తువ్వాలుతో తుడుచుకు "ఏటైతే..ఇసాకపట్నం ఎలిపోదుమంతావేటి! అక్కడ ఏటుందిరా?.. ఎక్కడెక్కడ నుంచో వచ్చినోళ్లు మొత్తం తినీసినారు.. సొంత హౌసులో జల్సాగా బతికినోళ్లము.. ఎపార్టుమెంటుల్లో బతకలేము రా!"

"అది కాదన్నా! ఇసాకపట్నాన్ని గోవా లాగా సేసేస్తారట! పెళ్ళాంతో కలిసి బీచీలో రెండు పెగ్గులు మింగినట్టు ఉండాలని మన ప్రియతమ నాయకుడు అప్పన్నపాత్రుడు గవరమెంట్‌కి.. డయిరక్షన్ ఇచ్చీసినాడట!"

"ఓసి.. ఇందాక అందుకే గెంతులేసినావా!"

పరదేశి ఊపిరి పీల్చుకొని, ఉత్సాహంగా నవ్వాడు.

"ఒరే పరదేశీ! నిజంగా వయిజాగు..గోవా లాగా మారిపోద్దా?"

"అదేటన్నా! మన ఇజానగరం రాజుగోరు.. గవినేరుగా గోవా ఎళ్లారు గదా! ఆయనకి గొప్ప నచ్చిందట!"

"ఒరేయ్! రాజులకి ఎక్కడైనా సెల్లుతాయిరా రాస భోగాలు! మనకెలాగా! లోకలోల్లు కీకలెయ్యారా!"

"ఇంకెక్కడ లోకలోళ్లన్నా! ఫిషింగ్ హార్బరంతా వ్యాపారస్తుల సేతుల్లో.. సేపలోళ్లందరూ.. కూలోలే! కంపెనీలన్నీ కోటీశ్వరుల సేతుల్లో.. కొండలన్నీ ఎవుడికి బడితే ఆడికి.."

"అలాగయిపోయిందా! శాన్నాళ్లయింది వొయిజాగు సూసి"

"అన్నా! నీకొక ఇసయం తెలీదు..సముద్రం ఒడ్డున కొబ్బరి తోటలు మొలిపించీసినారు..మన లీడర్లు తల్చుకుంటే.. బెల్ట్ షాపులు సందుకొకటి పుట్టించినోళ్లు.. సముద్రం ఒడ్డున నాలుగు సుక్కలు మింగడానికి సదుపాయాలు పుట్టించలేరా!"

"నిజమేన్రా! అయితే, మనం ఎపార్ట్‌మెంట్లో ఉండలేం.. మన లీడర్లని ఎలాగో ఒకలాగా ఖుషీ చేసి, ఏదో ఒక కొండ కొట్టీసి.. బంగళా కట్టీద్దుము"

"హాయి హాయి నాయకా!" పరదేశి నాయుడు పరవశిస్తూ, ఒకేసారి సగం సీసా మందుని తాగేసి, కిందా మీదా దొర్లడం మొదలుపెట్టాడు.


కనులు మూసుకున్న దసుమంతు నాయుడుకి పావురాల కొండమీద..కొత్త బంగ్లా పైన.. ఊయల్లో ఊగుతున్నట్టు ఊహ!!

- 'నల్లి' కుట్టు

అవీ ఇవీ

ఆ ఎమ్మెల్యేల జీతం మూడింతలు

- పీపీ



ఒరిస్సాను వరుసగా పాలించిన బిజెడి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పాలన స్థానంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేశాక జరుగుతున్న మార్పు ఇది. అయితే ఇవేవీ బిల్లు ఏకగ్రీవ ఆమోదానికి ఆటంకం కాలేదు. కాకపోతే క.తు (కంటి తుడుపు) ప్రక్రియ కోసం నవీన్ పట్నాయక్ తను పెంచిన జీతం తీసుకోబోనని, ఆ మొత్తం పేదల కోసం ఖర్చు చేయాలని కోరారు. లోపల అన్నిటికీ ముద్రేసేసి బయటికొచ్చి భంగిమలేమిటని శాసనసభ లాబీల్లో గుసగుసలూ వినిపించకపోలేదు మరి. జీతాలు ఇంత పెంచుకున్నారు సరే! జవాబుదారీతనం, బాధ్యతలు ఏమైనా పెంచుతున్నారా అని కొందరు సవాలు చేశారు కూడా. ఇవన్నీ చూస్తుంటే ఒకప్పుడు పుచ్చలపల్లి సుందరయ్య పార్లమెంటులో చేసిన ప్రసంగం గుర్తుకు రాకమానదు. ఎంపీల జీతాల పెంపును వ్యతిరేకిస్తూ ముందు కార్మికుల కనీస వేతనం పెంచే చర్చ చేయాలని ఆయన వాదించారు.

దేశంలోకెల్లా అత్యంత అధికంగా జీతం తీసుకునే ఎమ్మెల్యేలు ఎవరో తెలుసా? ఒరిస్సా నాయకులే. ఈ మధ్యనే ఆ శాసనసభ సమావేశాల చివరి రోజున వారి జీతాలు ఏక్‌దమ్మున మూడింతలు చేస్తూ బిల్లు ఆమోదించింది. దాంతోపాటే స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రుల జీతాలు కూడా పెంచేసింది. ఇప్పుడు వారికి నెలకు రూ.3 లక్షల 45 వేల జీతభత్యాలు వస్తాయి. ముఖ్యమంత్రికి అన్నీ కలిపి మరో యాభై వేలు అధికంగా ముడుతుంది. ఎమ్మెల్యే వేతనం రూ.35 వేల నుంచి రూ.90 వేలకు పెరిగితే భత్యాలు ఏకంగా రూ.65 వేల నుంచి రూ.2.55 లక్షలకు పెరుగుతాయి. ఇదే ఊపులో మాజీ ఎమ్మెల్యేల పెన్షన్లు కూడా భారీగా పెరుగుతున్నాయట. 2017 తర్వాత పెరుగుతున్న ఈ వేతనాల నిర్ణయం 2024 జూన్ నుంచి అమలులోకి వస్తుందట. అంటే వెనకటి కాలానికీ వర్తిస్తుందన్నమాట. ఒరిస్సాను వరుసగా పాలించిన బిజెడి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పాలన స్థానంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేశాక జరుగుతున్న మార్పు ఇది. అయితే ఇవేవీ బిల్లు ఏకగ్రీవ ఆమోదానికి ఆటంకం కాలేదు. కాకపోతే క.తు (కంటి తుడుపు) ప్రక్రియ కోసం నవీన్ పట్నాయక్ తను పెంచిన జీతం తీసుకోబోనని, ఆ మొత్తం పేదల కోసం ఖర్చు చేయాలని కోరారు. లోపల అన్నిటికీ ముద్రేసేసి బయటికొచ్చి భంగిమలేమిటని శాసనసభ లాబీల్లో గుసగుసలూ వినిపించకపోలేదు మరి. జీతాలు ఇంత పెంచుకున్నారు సరే! జవాబుదారీతనం, బాధ్యతలు ఏమైనా పెంచుతున్నారా అని కొందరు సవాలు చేశారు కూడా. ఇవన్నీ చూస్తుంటే ఒకప్పుడు పుచ్చలపల్లి సుందరయ్య పార్లమెంటులో చేసిన ప్రసంగం గుర్తుకు రాకమానదు. ఎంపీల జీతాల పెంపును వ్యతిరేకిస్తూ ముందు కార్మికుల కనీస వేతనం పెంచే చర్చ చేయాలని ఆయన వాదించారు.

నెహ్రూ లేఖలపై లేనిపోని గగ్గోలు

ఈ మధ్య వందేమాతరం చర్చ నెహ్రూపై ఆరోపణల సమయంలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ఒక ఆఫర్ చేశారు. నిరతరంఏదో విధంగా నెహ్రూపై నిందారోపణలు వెతికేబదులు ఒకరోజు ప్రత్యేక చర్చ పెడదాం. ఎంతసేపు చెబుతావో ఎన్ని ఆరోపణలు చేస్తారో చేసుకోండి అని ఆమె నవ్వుతూ అన్నారు. సభాపతి ఓం బిర్లా సర్కారును కాపాడ్డం కోసం విషయంపై మాట్లాడమని ఆమెను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రధాన మంత్రుల మ్యూజియం, గ్రంథాలయం (పి.ఎం.ఎం.ఎల్)లో నెహ్రూ లేఖలు మాయమైనాయనే ఆరోపణ కూడా ఈ పరంపరలో భాగమేనా? తీన్‌మూర్తి భవన్‌లో నెహ్రూ మ్యూజియంను ఈ పేరుతో మార్పు చేశారన్నది తెలిసిన విషయమే. ఈ కేంద్రం నిర్వాహకులలో ఒకరైన రివాజ్ ఖద్రీ చేసిన ఆరోపణ ఇందుకు కారణమైంది. నెహ్రూ వ్యక్తిగత లేఖలను సోనియా గాంధీ తీసుకుపోయారనేది ఆయన ఆరోపణ. నెహ్రూ-ఎడ్వినా మౌంట్‌బాటెన్ మధ్య నడిచిన లేఖలు సోనియా ఆదేశాలపై 2008లో మాయం చేశారని ఖద్రీ ఆరోపించారు. వీరిద్దరి మధ్య ఏదో వ్యవహారం నడిచిందనే కథలు చాలా కాలంగా ప్రచారంలో వున్నాయి. నెహ్రూ వంటి వారిపై చవకబారు పోస్టులు పెట్టి ఇప్పటికీ సంఘ్‌పరివార్ సంతోషిస్తుంటుంది. కనుక బిజెపి ఈ అంశంపై ఫోకస్ పెట్టడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అయితే వారి ఈ ప్రచారం కేవలం కల్పితమని ప్రభుత్వమే ఖండించాల్సి వచ్చింది. మ్యూజియంలో నెహ్రూకు సంబంధించిన పత్రాలేమీ తప్పిపోలేదని సాంస్కృతిక శాఖామంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తమ పార్టీ సభ్యుడే అయిన సంబిత్ పాత్రకు సమాధానమిచ్చారు. అసలు ఆ ప్రశ్నే ఉత్పన్నం కాదని కూడా బల్ల గుద్ది మరీ చెప్పారు. దీనిపై క్షమాపణ చెబుతారా అని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ ట్వీట్ చేశారు. ఎందుకు చెబుతారు?

ఆ చిత్రాలు చూపిస్తామన్న కేరళ

భావ ప్రకటనా స్వేచ్ఛకూ మోడీ సర్కారుకు బొత్తిగా పొసగదు కదా. 30వ కేరళ అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి (ఐ.ఎఫ్.ఎఫ్.కె) ఎంపిక చేసిన 19 చిత్రాలకు కేంద్రం కాలడ్డం పెట్టింది. వాటిని ప్రదర్శించడానికి లేదని సెన్సార్ బోర్డు తాఖీదు పంపింది. అయితే కేరళ ప్రగతిశీల సంస్కృతీ సంప్రదాయాలు ఈ కేంద్ర ప్రభుత్వానికి బోధపడవని రాష్ట్ర సాంస్కృతిక మంత్రి షాజీ చెరియన్ ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ 19 చిత్రాలు అంతర్జాతీయంగా మన్నన పొందినవే. విమర్శకులూ మెచ్చుకున్నవే, చిత్రోత్సవ ప్రతినిధులు వాటిని చూసేందుకున్న హక్కును మనమెలా నిరాకరించగలం? అని ఆయన ప్రశ్నించారు. చిత్రోత్సవ ప్రధాన వేదిక అయిన టాగూర్ ఆడిటోరియం దగ్గర డివైఎఫ్ఐ నిరసన ప్రదర్శన కూడా జరిపింది. ఈలోగా ఓ అడుగు వెనక్కు వేసిన కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ వాటిలో అయిదు చిత్రాలకు అనుమతినిస్తున్నట్టు తెలియజేసింది. బీఫ్, ఈగల్స్ ఆఫ్ రిపబ్లిక్, హార్ట్ ఆఫ్ ద వోల్ఫ్, వన్స్ అపాన్ ఎ టైమ్...ప్రదర్శించుకోవచ్చని తెలిపింది. అయితే మిగిలిన 14 సినిమాలు కూడా అనుకున్నట్టే వేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. పాలస్తీనా 36, ఆల్ దటీజ్ లెఫ్ట్ ఆఫ్ యూ...వంటివి వాటిలో వున్నాయి. సోవియట్ దర్శకుడు ఐజెన్‌స్టీన్ క్లాసిక్ 'బ్యాటిల్ షిప్ పోటెమ్‌కిన్' కూడా వాటిలో వుంది. పోలీసు క్రౌర్యాన్ని చూపే 'సంతోష్' ప్రదర్శన వుండబోతోంది. గురువారం మొదలయ్యే ఈ ఉత్సవంలో మౌరిటానియాకు చెందిన ప్రఖ్యాత దర్శకుడు అబద్‌రహమానే సిసాకోకు జీవన సాఫల్య పురస్కారం అందిస్తారు. ఆయన చిత్రాలు 'టింబక్టు, బ్లాక్ టీ' కూడా ప్రదర్శించబోతున్నారు.

అంతరిస్తున్న జానపద కళలను కాపాడుకోవాలి

- నాట్స్ చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని

ప్రజాశక్తి-గుంటూరు

అంతరించిపోతున్న తెలుగు జానపద కళలను కాపాడుకొని పూర్వవైభవం తేవాల్సిన అవసరం ఉందని ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని అన్నారు. గుంటూరులో బుధవారం నాట్స్ ఆధ్వర్యంలో జానపద సాంస్కృతిక సంబరాలను అధ్యక్షులు శ్రీహరి మందాడి, సాంస్కృతిక సంబరాల సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి హాజరైన కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం నుండి గరగల నృత్యం, శ్రీకాకుళం నుంచి జానదనృత్యం తప్పెటగుళ్ళు, భద్రాచలం నుండి గిరిజనుల కొమ్ముకోయ నృత్యం, గుంటూరు జిల్లాకు చెందిన డప్పు కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో 35 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు, ప్రజానాట్యమండలి రాష్ట్ర గాయకులు జగన్, పల్నాడు జిల్లా నాయకులు, కవి పెద్దిరాజుకు పురస్కారాలు అందజేశారు. గాయకుడు పివి రమణ, లెనీనా బృందం సభ్యులు గేయాలు ఆలపించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ అమెరికాతోపాటు, పుట్టి పెరిగిన నేల రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో నెల రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ నాట్స్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో విద్య, వైద్యం, సాంస్కృతిక రంగాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. తొలుత భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం కృషి చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహానికి హిందూ కాలేజి సెంటర్‌లో నాట్స్ ప్రతినిధులు, కళాకారులు పూలమాల వేసి నివాళులర్పించారు.



తప్పెటగుళ్లు నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

కేరళ అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో
19 సినిమాలకు నిరాకరణ

- ఉత్సవాల్లో వెల్లువెత్తిన నిరసనలు
- ప్రదర్శిస్తామన్న ముఖ్యమంత్రి పినరయి విజయన్



తిరువనంతపురం : కేంద్ర సమాచార, ప్రసార (ఐ అండ్ బి) మంత్రిత్వశాఖ నిరాశజనకమైన వైఖరితో వ్యవహరించింది. రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలోని కేరళ చలచిత్ర అకాడమీ నిర్వహిస్తున్న 30వ ఎడిషన్ ఉత్సవం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో 82 దేశాల నుండి 206 చిత్రాలు ప్రదర్శనకు ఎంపికయ్యాయి. అయితే ఇందులో సినిమాకు పాఠ్యపుస్తకంగా పరిగణించే 'బాటిల్‌షిప్ పోటెంకిన్' వంటి క్లాసిక్స్‌తో సహ పలు చిత్రాలు ప్రదర్శనకు నోచుకోలేదు. మొత్తంగా 19 చిత్రాలను ప్రదర్శించడానికి ఐఅండ్‌బి శాఖ అనుమతి నిరాకరించడంపై చిత్రోత్సవం వేదికపై తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. రాజకీయ చిత్రాలను చూడకుండా సినిమా ప్రేక్షకులను అడ్డుకోవాలన్న సంఘపరివార్ ద్వేషం ఫలితంగా ముందుగా నిర్ణయించిన అనేక చిత్ర ప్రదర్శనలను కేంద్రం రద్దు చేసింది. సెర్గి ఐన్‌స్టీన్ దర్శకత్వం వహించిన వందేళ్ళ నాటి సోవియట్ క్లాసిక్ అయిన బాటిల్‌షిప్ పోటెంకిన్‌తో పాటూ అనుమతి రద్దైన సినిమాల్లో 'ది అవర్ ఆఫ్ ది ఫర్నేసెస్' కూడా వుంది. అలాగే చిత్రోత్సవం ప్రారంభ చిత్రమైన పాలస్తీనా 36, స్పానిష్ చిత్రం బీఫ్, 2017లో ఐఎఫ్ఎఫ్‌కెలో సువర్ణ చకోరం గెలుచుకున్న పాలస్తీనా చిత్రం వజీబ్ వంటి చిత్రాలు కూడా ఈ జాబితాలో వున్నాయి. పాలస్తీనా చిత్ర ప్యాకేజీలో భాగమైన 'వన్స్ ఆపాన్ ఎ టైమ్ ఇన్ గాజా'తో సహ పలు రాజకీయ చిత్రాలు భారీ స్క్రూటినీని ఎదుర్కొన్నాయి. 2024లో కేన్స్ చిత్రోత్సవంలో విమర్శకుల ప్రశంసలు అందుకున్న, సంధ్య సూరి దర్శకత్వం వహించిన ఇండియన్-ఇంటర్నేషనల్ ప్రొడక్షన్ అయిన సంతోష్ కూడా రద్దైన చిత్రాల జాబితాలో వుంది. ఐఅండ్‌బి మంత్రిత్వ శాఖ అసంబద్ధంగా, ఏకపక్ష వైఖరితో తీసుకున్న ఈ నిర్ణయంపై చిత్రోత్సవాల ప్రతినిధుల మధ్య చర్చ జరిగింది. సమాచార, ప్రసార శాఖనే తొలుత ఈ చిత్రాలను ఎంపిక చేసిందని, తర్వాత వాటిని నిషేధించిందని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని వారు ఎద్దేవా చేశారు. ఇక దర్శకుడు ఇంగ్రిడ్ శాంటోస్ దర్శకత్వం వహించిన స్పానిష్ చిత్రమైన బీఫ్‌లో ప్రధానంగా వలసలు, గుర్తింపు, విచారం, తల్లీ కూతుళ్ళ మధ్య ఘర్షణ, హిప్-హాప్ సంస్కృతి, మహిళా సాధికారత వంటి అంశాలను చూపించారు. కానీ సినిమా పేరు 'బీఫ్' అయిన కారణంతోనే ఈ సినిమా ప్రదర్శనకు అనుమతిని నిరాకరించారని ప్రతినిధులు విమర్శించారు. ఆఫ్రికన్ డ్రామా అవార్డును గెలుచుకున్న చిత్రమైన టింబుక్టులో మాలి, ఆఫ్రికాల్లోని జిహాదీ గ్రూపులను తీవ్రంగా విమర్శించారు. జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్న దర్శకుడు అబ్దురహమాన్ సిసాకొ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో డ్రస్ కోడ్‌లపై విధించిన ఆంక్షలతో సహా రోజువారీ జీవితంలో ఎదుర్కొంటున్న నిషేధాజ్ఞలను సుదీర్ఘంగా వివరించారు.

ఆ చిత్రాలను ప్రదర్శిస్తాం : సిఎం విజయన్

ఈ చిత్రోత్సవంలోని పలు వేదికల్లో పాల్గొన్న ప్రతినిధులు కేంద్ర సమాచార, ప్రసారశాఖ చర్యలను తీవ్రంగా ఖండించారు. నిరసనలు చేపట్టారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ దీనిపై స్పందిస్తూ కేంద్ర వైఖరిని సహించమని, చిత్రోత్సవంలో అనుమతి నిరాకరించిన చిత్రాలను ప్రదర్శిస్తామన్నారు. కేంద్రం తీసుకున్న చర్య ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రగతిశీల భావాలు కలిగిన కేరళ ఇటువంటి జోక్యాలకు, బెదిరింపులకు లొంగదని స్పష్టం చేశారు.

ఈ చిత్రోత్సవాల్లోని సెన్సార్ జోక్యాన్ని చూస్తుంటే దేశవ్యాప్తంగా అసమ్మతి గళాలను, వైవిధ్యమైన సృజనాత్మక భావ వ్యక్తీకరణలను అణచివేయాలని భావించే సంఘ పరివార్ నిరంకుశ స్వభావం బట్టబయలవుతోందన్నారు. ఈ చర్య పౌరుల ప్రాథమిక హక్కులను కబళించడమేనని, రాష్ట్ర సాంస్కృతిక, అభివృద్ధి ఆకాంక్షలను దెబ్బ తీయడమేనని సాంస్కృతిక శాఖ మంత్రి సాజి చెరియన్ విమర్శించారు.

మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు

- జిఓ నెంబరు 2410 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్స్ రూల్స్-2025ను అమలు చేసేందుకు ప్రభుత్వం స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఎస్‌సి)ని నియమించింది. ఈ మేరకు బుధవారం జిఓ ఎంఎస్ నెంబరు 2410ని విడుదల చేసింది. మీడియా అక్రిడిటేషన్ రూల్స్ కమిటీ ఛైర్మన్‌గా ఐఅండ్‌పిఆర్ కమిషనరు/డైరెక్టర్, మెంబరు కన్వీనరుగా ఐఅండ్‌పిఆర్ కమిషనరు జాయింట్ డైరెక్టర్/అడిషనల్ డైరెక్టర్‌ను నియమించారు. మెంబర్లుగా గుర్తింపు పొందిన జర్నలిస్టు సంఘాల నుంచి ఒక్కో యూనియన్‌కు ఒక్కొక్కరు సభ్యులుగా ఉండాలని సూచించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఎపియుడబ్ల్యుజె,) ఎపి వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఎపి మీడియా ఫెడరేషన్ (ఎపిఎంఎఫ్), ఎపి జర్నలిస్ట్ ఫోరమ్ (ఎపిజెఫ్)కు అవకాశం కల్పించారు. చిన్న, మధ్య తరహా పత్రికలకు సంబంధించి స్మాల్ అండ్ మీడియం డైలీ న్యూస్ పేపర్ అసోసియేషన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సామ్నా ఎపి), ఎపి ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ (ఎపిఇఎంజెఎ), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఎపిబిజెఎ), ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఎపిపిజెఎ)కు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

సచివాలయాల్లో హాజరు తగ్గుదలపై సిఎం ఆగ్రహం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హాజరు 74 శాతం మాత్రమే ఉండటం పట్ల సిఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరుపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిఎస్‌డబ్ల్యుఎస్ శాఖ పేరును స్వర్ణ కుప్పం తరహాలో స్వర్ణ గ్రామం అనే పేరుతో మార్చే ఆలోచనలో ఉన్నట్లు, రెండు మూడు రోజుల్లో ఓ నిర్ణయం వెలువడుతుందని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, క్షేత్రస్థాయి ఉద్యోగుల పనితీరుపై సమీక్షించుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పాలనా యంత్రాంగం రోజువారీ విధులకు హాజరుకావాల్సిందేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే తీవ్రమైన చర్యలు ఉంటాయన్నారు. ఉద్యోగుల హాజరు, విధుల నిర్వహణపై కలెక్టర్లు మానిటరింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్‌హెచ్‌జిలకు రూ.34 వేల కోట్ల రుణాలు

● సెర్ప్ సిఇఒ కరుణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 83 లక్షల మహిళా సంఘాలకు మైక్రో క్రెడిట్ ప్లాన్ ద్వారా రూ.45 వేల కోట్ల బ్యాంకు లింకేజ్ అందించగా, ఇప్పటి వరకూ రూ.34 వేలకోట్లకు పైగా రుణాలు మంజూరు చేసినట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఎక్స్ అఫిషియో కార్యదర్శి వి కరుణ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో సెర్ప్ కార్యక్రమాలను ఆమె వివరిస్తూ.. గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత దిశగా పలు వినూత్న కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. డిజిటల్ ఎంపిపి వ్యవస్థతో పారదర్శకత పెరిగి 17,600 సెర్ప్ సంఘాలు నుంచి 4.96 లక్షల నకిలీ సభ్యులను తొలగించినట్లు పేర్కొన్నారు. ఈజీ మార్ట్ పేరుతో 924 స్టోర్లను విజయవంతంగా ప్రారంభించినట్లు తెలిపారు. ఒక్కో యూనిట్‌కు సగటు పెట్టుబడి రూ.5 లక్షలుగా, వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు పైగా అంచనా వేసినట్లు చెప్పారు. బాంబూ మిషన్‌లో 5 వేల మంది, మిలెట్ మిషన్‌లో 3,812 మంది, మొరింగా మిషన్‌లో 2,500 మంది మహిళలు, వీటికి కార్పొరేట్ సంస్థలతో బై బ్యాక్ ఒప్పందాలు కుదిరాయని తెలిపారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎవి నాగేశ్వరరావు

లేబర్ కోడ్లు రద్దు చేయాలి

● ఎపిఎంఎస్ఆర్‌యు ధర్నాలో నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను యథాతథంగా అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (ఎపిఎంఎస్ఆర్‌యు) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు విజయవాడలోని ధర్నా చౌక్‌లో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కార్మిక చట్టాలను రద్దు చేసి యాజమాన్యాలకు అనుకూలంగా ఉండే లేబర్ కోడ్లను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ కోడ్లను తమ రాష్ట్రంలో అమలుచేయబోమని కేరళ ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా ఈ కోడ్లను వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఎపిఎంఎస్ఆర్‌యు అధ్యక్షులు సిహెచ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ కోడ్ల వల్ల తమకు తీవ్ర నష్టం వస్తుందని చెప్పారు. కష్టపడి సాధించుకున్న సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టం రద్దవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. జనవరిలో జరగనున్న సిఐటియు జాతీయ మహాసభల్లో లేబర్ కోడ్ల రద్దు డిమాండ్ కోరుతూ.. కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఎపిఎంఎస్ఆర్‌యు ప్రధాన కార్యదర్శి సి వెంకట్రావు మాట్లాడుతూ.. సంఘం పెట్టుకునే హక్కు, ఈ కోడ్ల వల్ల పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక భద్రత పరిమిత హక్కులు కార్మికులు కోల్పోతారని తెలిపారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి ధర్నా శిబిరాన్ని సందర్శించారు. రెండు రోజుల ధర్నాలో యూనియన్ ఉపాధ్యక్షులు కృష్ణయ్య కోటేశ్వరరావు, సంయుక్త ప్రధాన కార్యదర్శి యుఎస్ రవికుమార్, కోశాధికారి డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The general public hereby informed that DARAPANENI RAMA KRISHNA S/ O.LATE.VENKATESWARLU aged about 46 years, has approached the Shriram Finance Ltd., Ameerpet Branch, Hyderabad by put his documents by way of mortgage in respect of Schedule of Property to secure the future Liability towards Loan amount. If any person or person's having any objections. Right, claim, title, interest over the Schedule of Property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned to DARAPANENI RAMA KRISHNA S/ O.LATE. VENKATESWARLU and no claim or no objection of any kind thereafter will be entertained.

SCHEDULE OF PROPERTY

All that the Site along with RCC Daba House with all other amenities Municipal Old Ward No.3, Block No.3, Block No.12, T.S.No. 723/1, bearing Municipal Door No.7-11-38, Old Assessment No.13313, New Assessment No. 46876, admeasuring 650 Sq.Yds., Situated at Arundelpet area, Guntur City, Guntur Municipal Corporation area, Guntur District., Sub Dist., Guntur and **bounded by:**
NORTH: Property of Gudivada Subba Rao by the side of wall of this property SOUTH: Own Wall of this house by the side of property of Pulivarthi Krishna etc... EAST: Own Wall of this house by the side of property of Laganasani Lingaiah, etc WEST: Municipal Corporation Road

By **R. VENKATESHWAR RAO**
ADVOCATE

బిఎండబ్ల్యు కార్ల ఉత్పత్తిని ప్రారంభించాలి : రాహుల్

న్యూఢిల్లీ : లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ జర్మనీలో పర్యటిస్తున్నారు.. ఈ పర్యటనలో భాగంగా ఆయన బిఎండబ్ల్యు ఫ్యాక్టరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మేము బిఎండబ్ల్యు ఫ్యాక్టరీని వెళ్లాము. అద్భుతమైన అనుభవం. 450 సిసి బైక్, టివిఎస్ బ్రాండ్ కలిగి ఉండటం చూసి నేను ఉత్సాహంగా ఉన్నాను. ఇక్కడ భారత జెండా ఎగురుతుండటం చూసి సంతోషించాను. భారత్‌లో ఉత్పత్తిని ప్రారంభించాలి. ఏ దేశానికైనా ఉత్పత్తి కీలకం. మన దేశ తయారీ క్షీణిస్తోంది. వాస్తవానికి అది పెరుగుతూ ఉండాలి. కానీ తగ్గుతోందంటూ సామాజిక మాధ్యమంలో రాహుల్ వ్యాఖ్యానించారు.


ట్రిలియనీర్ డాలర్ల దిశగా ఎలన్ మస్క్ సంపద



వాషింగ్టన్ : ప్రపంచంలోనే అత్యంత కుబేరుడు, ట్రంప్ సన్నిహితుడు ఎలన్ మస్క్ సంపద ఇటీవల భారీగా పెరుగుతోంది. మంగళవారం నాటికి ఆయన నికర సంపద 677 బిలియన్ డాలర్లకు చేరి ట్రిలియన్ డాలర్ల వైపు దూసుకుపోతోంది. మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ కేవలం నాలుగు నెలల క్రితం ఆగస్టులో ఉన్న విలువ కంటే రెట్టింపు అయ్యింది. ప్రస్తుతం స్పేస్‌ఎక్స్ విలువ 800 బిలియన్లకు చేరింది. మస్క్ సంపద ఒక్క రోజులోనే 168 బిలియన్ డాలర్లకు పెరిగింది. స్పేస్‌ఎక్స్‌లో ఆయన వాటా 42 శాతంతో 168 బిలియన్లుగా ఉంది. టెస్లాలో 12 శాతం వాటాతో 197 బిలియన్లకు చేరింది. మస్క్ కొత్త స్టార్టప్ ఎక్స్‌ఎఐ విలువ సుమారు 230 బిలియన్లకు పెరిగింది. ఇందులో మస్క్‌కు 53 శాతం. వాటా ఉంది. ప్రపంచంలో రెండో అత్యంత ధనవంతుడైన గూగుల్ సహ వ్యవస్థాపకుడు లారీ పేజ్ 252 బిలియన్ల సంపద కంటే ఎలన్ మస్క్ 425 బిలియన్లు ఎక్కువ సంపదను కలిగి ఉన్నారు. ముఖేష్ అంబానీ సంపద ప్రస్తుతం 111.4 బిలియన్లుగా ఉంది.

ఉపాధి హామీలో మార్పులను వ్యతిరేకిస్తూ 22న దేశవ్యాప్త నిరసనలు

ఐదు వామపక్షాల పిలుపు



న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ)లో కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న మార్పులను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఈ నెల 22న నిరసన దినం పాటించాలని ఐదు వామపక్ష పార్టీలు సంయుక్తంగా పిలుపిచ్చాయి. ఈ మేరకు సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, ఆర్ఎస్‌పి, ఎఐఎఫ్‌బి నేతలు ఎం.ఎ.బేబీ, డి.రాజా, దీపాంకర్ భట్టాచార్య, మనోజ్ భట్టాచార్య, జి.దేవరాజన్‌లు ఒక బుదవారం ప్రకటన విడుదల చేశారు. యుపిఎ ప్రభుత్వంపై ఆనాడు వామపక్షాలు తీసుకువచ్చిన ఒత్తిడి ఫలితంగా రూపుదిద్దుకున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మౌలిక స్వభావాన్ని మార్చాలన్న బిజెపి ప్రభుత్వ చర్యను వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ చట్టం స్థానే కేంద్రం కొత్తగా తీసుకురావాలనుకుంటున్న వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్)బిల్లు, 2025కు వ్యతిరేకంగా నిరసనలు తెలియచేసేందుకు ఈ నెల 22వ తేదీన పెద్ద సంఖ్యలో ప్రజలు ముందుకు రావాలని వామపక్షాలు పిలుపిచ్చాయి.

ఎంజిఎన్ఆర్ఇజిఎ అనేది పరిమిత స్థాయిలో పనిచేసే హక్కును కల్పించే సార్వత్రిక, డిమాండ్ ఆధారిత చట్టం. కానీ కొత్తగా తీసుకువచ్చిన బిల్లు ఈ చట్టం స్వభావాన్ని మారుస్తోంది. కనీసం ఈ పరిమిత హక్కును కూడా ప్రజలకు అందకుండా నిరాకరిస్తోంది. డిమాండ్‌కు తగినట్లుగా నిధులను కేటాయించాల్సిన బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వానికి చట్టబద్ధంగా తప్పిస్తుంది.

ఇక ఉపాధి హామీని వంద నుండి 125 రోజులకు పెంచుతున్నామని ప్రభుత్వం ఆకర్షణీయంగా వెల్లడించింది. అయితే ఉపాధి కార్డులను హేతుబద్ధీకరిస్తున్నామన్న పేరుతో పెద్ద సంఖ్యలో గ్రామీణ కుటుంబాలను ఈ బిల్లు మినహాయిస్తోంది. వ్యవసాయ పనులు రద్దీగా వుండే సమయాల్లో 60రోజుల వరకు ఉపాధిని నిలుపు చేయడం వల్ల అత్యంత అవసరమైన సమయాల్లో గ్రామీణ కార్మికులకు పని నిరాకరించబడుతుందని, తద్వారా వారిని భూస్వాములపై ఆధారపడేలా చేస్తుందని వామపక్షాలు విమర్శించాయి. దీంతోపాటు డిజిటల్ హాజరును తప్పనిసరి చేయడంతో పని ఒత్తిడి పెరుగుతుందని, వారి హక్కులు నిరాకరించబడడంతో పాటూ కార్మికులకు తీవ్రంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రకటనలో వివరించారు.

ఈ పథకానికి నిధులు అందించే విధానంలో మార్పును ప్రతిపాదించడం ద్వారా కేంద్రం తన బాధ్యతను రాష్ట్రాల పైకి బదిలీ చేసింది. దీనివల్ల నిర్ణయాలు తీసుకునే క్రమంలో రాష్ట్రాలకు ఎలాంటి పాత్ర లేకుండా పోతుంది, మరోపక్క అపరిమితమైన ఆర్థిక భారాలను రాష్ట్ర ప్రభుత్వాలపై మోపుతోందని వామపక్షాల నేతలు విమర్శించారు. నిరుద్యోగ భృతి, పనులు కల్పించడంలో ఆలస్యమైనందుకు ఇచ్చే నష్టపరిహారం ఈ రెండింటికీ అయ్యే ఖర్చును కూడా రాష్ట్రాలే భరించాల్సి వస్తుందని భావిస్తున్నారు. ఈ మార్పులన్నీ కూడా పథకం ప్రజలకు చేరువ అవకుండా వుండేందుకు ఉద్దేశించినవే, కేంద్ర ప్రభుత్వ జవాబుదారీతనాన్ని నీరుగార్చేవే.

పేరు మార్పు మహాత్ముడిని అవమానించడమే..

ఎంజిఎన్ఆర్ఇజిఎగా వున్న ఈ పథకం పేరును విబి–జి రామ్ జిగా మార్చడం మహాత్ముడిని అవమానించడమే, పైగా ఆయన వారసత్వం పట్ల బిజెపి/ఆర్ఎస్ఎస్‌కు గల శతృత్వాన్ని ప్రతిబింబించలేదు.

విబి జి–ఆర్ఎఎం–జి బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ చట్టంలో తీసుకురాదలచిన ప్రతిపాదిత మార్పులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 22వ తేదీన వామపక్షాలు చేపట్టనున్న నిరసనల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని ఆ ప్రకటన పిలుపిచ్చింది. ఈ పథకాన్ని సార్వజనీనం చేయడం ద్వారా, అవసరమైన నిధులు కేటాయించి, కనీస ఉపాధిని 200 రోజులకు తగ్గకుండా హామీ కల్పించడం ద్వారా ఎంజిఎన్ఆర్ఇజిఎను మరింత బలోపేతం చేయాలని వామపక్షాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.

బీమా చట్టాల సవరణ జాతీయ ప్రయోజనాలకు విఘాతం

- ఖండించిన సిఐటియు

న్యూఢిల్లీ : లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఇన్సూరెన్స్ చట్టాల (సవరణ) బిల్లును సిఐటియు తీవ్రంగా ఖండించింది. జాతీయ ప్రయోజనాలకు తీవ్రంగా విఘాతం కలిగించే ఈ తిరోగమన బిల్లును తీవ్రంగా వ్యతిరేకించాల్సిందిగా ప్రజాస్వామ్య శక్తులందరికీ, కార్మికులకు, పాలసీదారులకు పిలుపునిచ్చింది. బీమాకంపెనీల్లో వంద శాతమూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతినిచ్చే నిబంధన అత్యంత ప్రమాదకరమైందని పేర్కొంది. దేశీయ పొదుపు మొత్తాలనేవి ఆర్థిక ప్రగతికి వెన్నెముక వంటివని, ఒక సంక్షేమ దేశంగా భారత దేశం అటువంటి పొదుపులపై నియంత్రణను అట్టిపెట్టుకోవాలని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా వ్యతిరేక, జాతి వ్యతిరేక బిల్లును తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాల కన్నా కార్పొరేట్ లాభాలకు పెద్ద పీట వేసే ఈ ప్రభుత్వం గుడ్డిగా నయా ఉదారవాద విధానాలను అమలు చేయడం మానుకోవాలని సిఐటియు కోరింది. ఎల్ఐసిని దశలవారీగా కార్పొరేటీకరిస్తూ, అంతిమంగా ప్రైవేటీకరించే దిశగా ఇదొక చర్య అని సిఐటియు హెచ్చరించింది. అధికంగా విదేశీ పెట్టుబడులు రావడం వల్ల బీమా వ్యాప్తి పెరుగుతుందన్న ఆలోచన కేవలం భ్రమ మాత్రమేనని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకించింది.

'రియల్' సంస్థలకు 99 పైసలకే 27 ఎకరాలు

- ఫిల్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి–అమరావతి



విశాఖపట్నంలో ఒక రియల్ ఎస్టేట్ సంస్థకు ఎకరం 99 పైసల చొప్పున 27.10 ఎకరాలను ప్రభుత్వం ఇచ్చిందంటూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు బుధవారం విచారించింది. ఎకరా 99 పైసల చొప్పున రియల్ ఎస్టేట్ కంపెనీకి ఎలా ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కంపెనీల నుంచి దరఖాస్తుల స్వీకరణకు నోటిఫికేషన్ జారీ చేశారో లేదో చెప్పాలని ఆదేశించింది. దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేస్తే ఇతర కంపెనీలు కూడా రాష్ట్రానికి రావడానికి ఆసక్తి చూపేవని అభిప్రాయపడింది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్రాన్ని ఆదేశించింది. రహేజాకు భూ కేటాయింపులకు అమలు చేసిన విధానాన్ని కూడా నిషేధించాలంది. విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశాలు జారీ చేసింది.

విశాఖపట్నం, మధురవాడ, ఐటి హిల్‌లో ఎకరా 99 పైసల చొప్పున 27.10 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ కంపెనీ రహేజా కార్ప్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ కాన్స్టిట్యూషనల్ రైట్స్ సంస్థ అధ్యక్షులు, మానవ హక్కుల కమిషన్ పూర్వ సభ్యుడు జి శ్రీనివాసరావు వేసిన పిల్‌పై విచారణను వాయిదా వేసింది. తొలుత సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదిస్తూ, ఒక రియల్ ఎస్టేట్ కంపెనీకి ప్రభుత్వ భూమిని కట్టబెట్టడం దారుణమన్నారు. భూమిని రక్షించే ధర్మకర్తగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం ఇలా ధారాదత్తం చేయడాన్ని అడ్డుకోవాలని కోరారు. ఎకరా 99 పైసలు చొప్పున 27 ఎకరాలు ఇచ్చిందన్నారు. జిఓ 204ను పరిశీలిస్తే రియల్ ఎస్టేట్ సంస్థకే ప్రభుత్వం భూమి ఇచ్చిందని తెలుతుందన్నారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతిపాదన చేస్తూ, కంపెనీలకు భూ కేటాయింపులపై ఇప్పటికే పిల్ విచారణలో ఉందని, పిటిషనర్ భూ కేటాయింపులను సవాల్ చేశారన్నారు. ప్రభుత్వ కౌంటర్ నిమిత్తం విచారణ రెండు వారాలకు వాయిదా పడింది.

లోక్ అదాలత్‌కు స్పందన

ప్రజాశక్తి–అమరావతి

జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా రాష్ట్రంలో నిర్వహించిన లోక్ అదాలత్‌కు భారీ స్పందన లభించింది. రికార్డు స్థాయిలో కేసులు పరిష్కారమయ్యాయి. ఒక్కరోజే 3 లక్షల 11 వేల 230 కేసులు పరిష్కారమయ్యాయి. దీంతో రూ.400 కోట్లకు పైగా పరిహారాన్ని కక్షిదారులకు చెల్లింపులు జరిగాయి. ఇంతపెద్ద స్థాయిలో కేసుల పరిష్కారం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిశారని హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ చెప్పారు. ఈ వివరాలను న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సత్య హిమబిందు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

హిడ్మా, ఇతరులది బూటకపు ఎన్‌కౌంటర్

- జ్యుడీషియల్ విచారణకు పిల్ దాఖలు

ప్రజాశక్తి–అమరావతి

మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా, మరో నేత మడ్వి రాజే అలియాస్ రాజక్క, ఇతరులను ఎన్‌కౌంటర్ పేరుతో మట్టుబెట్టారని, ఈ ఘటనపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ఎన్‌కౌంటర్‌పై ఈ నెలలో జరగబోయే మెజిస్టీరియల్ విచారణను నిలిపివేయాలని పీపుల్స్ యూనిటీ ఫర్ సివిల్ లిబర్టీస్ హ్యూమన్ రైట్స్ ఫోరం అధ్యక్షులు జయ వింధ్యాల పిల్ దాఖలు చేశారు. దీనిని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. న్యాయవాది చల్లా శ్రీనివాసరెడ్డి వాదిస్తూ.. హిడ్మా, ఇతరులను భద్రతా బలగాలు గత నెలలో అదుపులోకి తీసుకుని చట్ట ప్రకారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చకుండా చిత్ర హింసలకు గురిచేశాక ఎన్‌కౌంటర్ చేశారని చెప్పారు. బూటకపు ఎన్‌కౌంటర్ ఘటనపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని కోరారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతివాదన చేస్తూ.. మెజిస్టీరియల్ విచారణపై అభ్యంతరాలుంటే సంబంధిత సెషన్స్ కోర్టులో సవాల్ చేసుకోవాలని చెప్పారు. పిల్ దాఖలు చేయడం చెల్లదన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టు తీర్పులున్నాయని పేర్కొన్నారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ.. సుప్రీంకోర్టు జారీ చేసిన గైడ్‌లైన్స్‌ను పిటిషనరు పరిశీలించాలని చెప్పి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

పార్టీ మారినట్టు ఆధారాల్లేవ్...

(మొదటిపేజీ తరువాయి)

ఎంఎల్‌ఎలు పార్టీ ఫిరాయించారని కెపి వివేకానంద, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, చింతా ప్రభాకర్ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ పిటిషన్‌పై రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో ఉన్న ఆరో పేరాలో అధికారాల ఆధారంగా స్పీకర్ ట్రిబ్యునల్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తూ తీర్పు ఇచ్చారని తెలిపారు.

నేడు మరో తీర్పు?

పార్టీ ఫిరాయింపు చట్టం ప్రకారం మొత్తం పది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిలో ఎనిమిది మందికి సంబంధించి స్పీకర్ విచారణ పూర్తి చేశారు. దానం నాగేందర్, కడియం శ్రీహరిపై దాఖలైన పిటిషన్లను సంబంధించిన విచారణ ఇంకా పూర్తి కాలేదు. ఆ ఇద్దరు మరింత సమయం కోరడంతో విచారణ పెండింగ్‌లో ఉంది. అనర్హత పిటిషన్లపై స్పీకర్ త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో బిఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై ఈ నెల 19న మరోమారు విచారణ జరగనుంది. ఎనిమిది మందికి సంబంధించి విచారణ పూర్తి చేసిన స్పీకర్, బుధవారం ఐదుగురికి సంబంధించి తీర్పు ఇచ్చారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలే యాదయ్య, సంజయ్‌కుమార్‌కు సంబంధించి గురువారం తీర్పు వెలువడే అవకాశం ఉంది. సుప్రీం తీర్పు సమయాని కంటే ముందే స్పీకర్ తీర్పు వచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

విబి–జి రామ్ జి బిల్లును వెనక్కి తీసుకోవాలి

- ఉపాధి హామీని కాపాడాలి
- 19న జాతీయ కార్యాచరణ
- వ్యవసాయ కార్మిక సంఘాలు, మేధావులు

ప్రజాశక్తి – న్యూఢిల్లీ బ్యూరో

విజి–జిఆర్ఎఎంజి బిల్లును తిరస్కరించాలని, ఎంజిఎన్ఆర్ఇజిఎను కాపాడాలని ఈ నెల 19న జాతీయ కార్యాచరణ దినంగా పాటించాలని వ్యవసాయ కార్మిక సంఘాలు, మేధావులు పిలుపునిచ్చారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో యోగేంద్ర యాదవ్ అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు, మేధావులు మాట్లాడారు. ప్రతిపాదిత వికసిత్ భారత్ – గ్యారెంటీ పర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (విజి–జిఆర్ఎఎంజి) బిల్లును ఖండించారు. కార్మికులు, కార్మిక సంఘాలతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా ప్రవేశపెట్టిన ఈ బిల్లు, ఎంజిఎన్ఆర్ఇజిఎ చట్టాన్ని రద్దు చేస్తుందని విమర్శించారు. ఉపాధి హామీని కేంద్ర ప్రభుత్వం దయా దాక్షిణ్యాలపై నడిచే ఒక పథకంగా మారుస్తుందన్నారు. జెఎన్‌యు ప్రొఫెసర్, కేరళ ప్రణాళిక బోర్డు మాజీ వైస్ ఛైర్మన్ ప్రభాత్ పట్నాయక్ గ్రామీణ సంక్షోభ సమయాల్లో హామీ ఇవ్వబడిన ఉపాధి హక్కు కీలకమైందిగా చెప్పారు. రాజస్తాన్‌లోని బీవార్‌కు చెందిన వితంతువు కమలాదేవి 18 ఏళ్లుగా ఎన్ఆర్ఇజిఎలో పనిచేస్తున్నారని, ఆమె భర్త మరణించినప్పుడు, ఆమెకు భూమి లేదా పిల్లలు లేనప్పుడు ఎన్ఆర్ఇజిఎ తన ఏకైక ఆదాయ వనరని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాత్ పట్నాయక్

ఎన్ఆర్ఇజిఎ లేకుండా ఆమె ఎలా బతకగలరు? అని అన్నారు. ఆర్థికవేత్త ప్రొఫెసర్ జయతి ఘోష్ మాట్లాడుతూ.. ఈ బిల్లు దేశంలో సమాఖ్యవాదానికి ఎదురయ్యే సవాల్ అని చెప్పారు. ముఖ్యంగా ప్రతిపక్ష రాష్ట్రాలకు వ్యతిరేకంగా నిధులను కేటాయించకుండా దీన్ని ఆయుధంగా ఉపయోగించే ధోరణిలో ఈ బిల్లును రూపొందించారు. అయితే, కొత్త బిల్లు ద్వారా కొత్త ప్రాంతాలు, పనులను నిర్ణయించడానికి కేంద్రానికి పూర్తి అధికారాలను ఇస్తుందని విమర్శించారు. ఈ బిల్లులో అత్యంత ప్రమాదకరమైనది ఏమిటంటే, బడ్జెట్‌పై పరిమితిని కేంద్రం విధిస్తుందన్నారు. అంతకుమించి రాష్ట్రాలు ఈ పథకానికి 100 శాతం నిధులు సమకూర్చాల్సి ఉంటుందని తెలిపారు. ఇది ఉపాధి హామీ ఎక్కువగా అవసరమయ్యే పేద రాష్ట్రాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని తెలిపారు. ఆర్థికవేత్త, సామాజిక కార్యకర్త జీన్ డ్రెజ్ మాట్లాడుతూ.. 'ఏ చట్టం వల్ల భారతదేశాన్ని విశ్వ గురువు అని పిలవవచ్చో, అది ఎన్ఆర్ఇజిఎనే' అని అన్నారు. కొత్త బిల్లు ద్వారా కేంద్రానికి ప్రమాదకరమైన విచక్షణాధికారాలు ఇస్తుందన్నారు. 2021 నుండి బెంగాల్‌లో పనుల నిలిపివేత, వివక్షాపూరిత సాంకేతిక చర్యలు, నిధుల కోతలు వంటి అంశాలను గుర్తుచేశారు. కొత్త బిల్లును వెనక్కి తీసుకొని, ఎన్ఆర్ఇజిఎను బలోపేతం చేసేవరకు తాము నిరసనలు ఆపమన్న శ్రావణి దేవి మాటలను డ్రెజ్ పునరుద్ఘాటించారు. ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ.. ఎన్ఆర్ఇజిఎ కార్మికులకు, రైతులకు మధ్య ప్రభుత్వం తప్పుడు విభజన సృష్టించడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. వాస్తవానికి, ఎన్ఆర్ఇజిఎ దేశంలో వ్యవసాయ పనులపై ప్రతికూల ప్రభావం చూపడం లేదని, చిన్న రైతులు, చేతివృత్తుల వారు తమ పోరాటంలో కార్మికులకు మద్దతు ఇస్తున్నారని తెలిపారు. ఈ కొత్త బిల్లు దేశంలో కొత్త బానిస, భూస్వామ్య వ్యవస్థను సృష్టిస్తుందని, గ్రామీణ వేతనాలపై ఎన్ఆర్ఇజిఎ చూపిన సానుకూల ప్రభావాలను బలహీనపరుస్తుందని ఆయన అన్నారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు ఉపాధ్యక్షులు అన్నీ రాజా మాట్లాడుతూ.. ఎన్ఆర్ఇజిఎకు దారితీసిన చారిత్రాత్మక పోరాటం గురించి వివరించారు. దీని కోసం మహిళలు, అణగారిన వర్గాలు, యువత వంటి సమాజంలోని అన్ని వర్గాలు పోరాడాయని గుర్తుచేశారు. ఎంకెఎస్ఎస్ నేత ముఖేష్ నిర్వాసిత్ మాట్లాడారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు.. పలువురు ఎంపిలను కలిసి ఈ బిల్లును వ్యతిరేకించాలని కోరారు.

ఆర్‌జి కార్ అత్యాచార కేసు కోల్‌కతా హైకోర్టుకు బదిలీ

న్యూఢిల్లీ : ఆర్‌జి కార్ మెడికల్ కాలేజీ ట్రైనీ అత్యాచారం, హత్య కేసును కోల్‌కతా హైకోర్టుకు బదిలీ చేసినట్లు సుప్రీంకోర్టు బుధవారం తెలిపింది. ఈ పిటిషన్‌లను విచారించడానికి తగిన డివిజన్ బెంచ్ ఏర్పాటు చేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించిన పత్రాలను కోల్‌కతా హైకోర్టుకు పంపాల్సిందిగా జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన వైద్యులు, బాధితురాలి తల్లిదండ్రుల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కరుణల నుండి విజ్ఞప్తిని స్వీకరించిన సుప్రీంకోర్టు, కేసును ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయడానికి నిరాకరించింది. సిబిఐ స్టేటస్ రిపోర్ట్ కాపీని తల్లిదండ్రులకు ఇవ్వాలని తన రిజిస్ట్రీని ఆదేశించింది. గత ఏడాది ఆగస్టు 9న కోల్‌కతాలోని సెమినార్ గదిలో ట్రైన్ డాక్టర్ అత్యాచారానికి గురైన సంగతి తెలిసిందే.

అభ్యంతరాలు బేఖాతర్

(మొదటిపేజీ తరువాయి)

వలసలు పెరిగి గ్రామీణాభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడుతోందని విపక్షాలు విమర్శించాయి. అలాగే రాష్ట్రాలపై అదనపు భారం పడుతోందని పేర్కొన్నాయి. ఈ బిల్లును విస్తృత పరిశీలన కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి), లేదా సెలెక్ట్ కమిటీకి పంపాలని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేశారు. పౌర అణుశక్తి బిల్లును కేంద్ర అణుశక్తి శాఖ మంత్రి జితేంద్ర సింగ్ చర్చకు ప్రవేశపెట్టగా, ప్రతిపక్ష సభ్యులు తీవ్రంగా నిరసించారు. పౌర అణుశక్తి రంగం ప్రవేట్ గుత్తాధిపత్యానికి వెళ్తుందని, దీనివల్ల అదానీ, అంబానీ, టాటా, జిందాల్ వంటి కార్పొరేట్లకు లాభం జరుగుతోందని పేర్కొన్నారు. ఇది జాతీయ భద్రతకు నష్టం చేస్తోందన్నారు. దీనిని కూడా విస్తృత పరిశీలన కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జెపిసి), సెలెక్ట్ కమిటీకి పంపాలని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేశారు. అయితే ప్రతిపక్షాల డిమాండ్‌ను తిరస్కరించిన కేంద్ర ప్రభుత్వం, తనకున్న సంఖ్యాబలంతో ఏకపక్షంగా ఆమోదించుకుంది. మరోవైపు రాజ్యసభలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఇన్సూరెన్స్ రంగంలో వందశాతం ఎఫ్‌డిఐలను అనుమతిస్తూ బిల్లును చర్యకు ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రతిపక్ష సభ్యులు వ్యతిరేకించారు. ఇది దేశ బీమా రంగాన్ని చిన్నాభిన్నం చేస్తోందని, దేశ బీమారంగంపై విదేశీ శక్తుల ఆధిపత్యం పెరుగోతందని విమర్శించారు. దీనితో దేశ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని, ఎల్ఐసి వంటి కోట్లాది మంది పాలసీదారులు ఉన్న సంస్థలపై ప్రత్యక్ష ప్రభావం పడుతోందని పేర్కొన్నాయి. ఈ బిల్లును కూడా విస్తృత పరిశీలన కోసం పంపాలని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేశారు. అలాగే లోక్‌సభలో వాడుకలో లేని చట్టాలను రద్దు చేయడానికి లేదా సవరించడానికి సంబంధించిన బిల్లును ఆమోదం పొందింది. ఈ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టగా, చర్చ అనంతరం లోపాలను సరిదిద్దడం, పౌరుల జీవన సౌలభ్యాన్ని పెంచడం లక్ష్యంగా 71 వాడుకలో లేని చట్టాలను రద్దు చేయడానికి బిల్లును ఆమోదించారు. అయితే ప్రతిపక్షాల డిమాండ్‌ను తిరస్కరించి, ఏకపక్షంగా బిల్లులను బిజెపి ప్రభుత్వం ఆమోదించుకుంది.


చమురు ట్యాంకర్ల దిగ్బంధనం

- వెనిజులాపై మరిన్ని చర్యలకు తెగబడిన అమెరికా
- మదురోపై విషం చిమ్మిన ట్రంప్

కారకాస్ : ఆంక్షల నడుమ వెనిజులాకు రాకపోకలు సాగిస్తున్న చమురు ట్యాంకర్లను పూర్తి స్థాయిలో దిగ్బంధించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్ వేదికలో ఓ పోస్ట్ పెట్టారు. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోపై ఆయన మరోసారి విషం చిమ్ముతూ దొంగిలించిన చమురు సంపదను ఉపయోగిస్తూ నేరాలు, ఉగ్రవాదం, మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 'వెనిజులాను యుద్ధ నౌకలు పూర్తిగా చుట్టుముట్టాయి. దక్షిణ అమెరికాలో మున్నెన్నడూ ఈ విధంగా మోహరింపు జరగలేదు' అని తెలిపారు. అమెరికా చమురును, భూమిని, ఇతర ఆస్తులను వెనిజులా తిరిగి ఇవ్వని పక్షంలో ఈ మోహరింపు మరింత పెరుగుతుందని హెచ్చరించారు.

మదురో ప్రభుత్వంపై అక్కసు

మదురో ప్రభుత్వాన్ని తాము ఒక 'విదేశీ ఉగ్రవాద సంస్థ'గా పరిగణిస్తున్నామని ట్రంప్ తెలిపారు. ఆ ప్రభుత్వం మాదక ద్రవ్యాలను రవాణా చేస్తోందని, కిడ్నాపులకు పాల్పడుతోందని, మనుషులను స్మగ్లింగ్ చేస్తోందని, హింసకు తెగబడుతోందని ఆరోపించారు. వెనిజులా క్షేత్రాల నుంచి దొంగిలిం చిన చమురుతో సంపాదించిన సొమ్మును మాదక ద్రవ్యాల ఉగ్రవాదానికి వినియోగిస్తోందని ధ్వజమెత్తారు. ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్న దొంగతనాన్ని, నేరపూరిత కార్యకలా పాలను అమెరికా ఇంకెంత మాత్రం సహించబోదని చెప్పారు.



వెనిజులియన్లను తిప్పిపంపుతాం

ట్రంప్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఆంక్షలను ఎదుర్కొంటూ వెనిజులాకు రాకపోకలు సాగిస్తున్న చమురు ట్యాంకర్లను అమెరికా దళాలు అడ్డుకుంటాయి. అయితే ఎన్ని దిగ్బంధనలు ఉంటాయి, మిత్ర దేశాలు కూడా ఇందులో భాగస్వాములవుతాయా అన్నది ఆయన వివరించలేదు. ట్రంప్ తన తాజా చర్యను ఇమ్మిగ్రేషన్‌తో ముడిపెట్టారు. బైడెన్ ప్రభుత్వ హయాంలో అమెరికాలో ప్రవేశించిన వెనిజులా ప్రజలను త్వరితగతిన తిప్పిపంపుతామని చెప్పారు.

అష్ట ద్రిగ్బంధం

వెనిజులాను అమెరికా అష్టద్రిగ్భధం చేస్తుంది. గగనతలం, సముద్రమార్గం వరకూ అన్ని వైపులా క్రమంగా నిర్భందిస్తుంది.. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో యుద్ధ మేఘాలు కమ్ముకొస్తున్నాయి. అమెరికా సైన్యం ఇప్పటికే కరేబియన్‌లోనూ, వెనిజులా జలాల సమీపంలోనూ పెద్ద ఎత్తున మోహరించింది. ఆ ప్రాంతంలో ఉన్న యుద్ధ నౌకలు అదను కోసం వేచి చూస్తున్నాయి. మరోవైపు గగనతల నిఘా కూడా కొనసాగుతోంది. మాదక ద్రవ్యాలను రవాణా చేస్తున్నాయన్న కారణంతో అనేక ఓడలను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. ఈ వారం ప్రారంభంలో వెనిజులా తీరం సమీపంలో ఓ చమురు ట్యాంకర్‌పై అమెరికా దాడి చేసి దానిని తన అధీనంలోకి తీసుకుంది. అయితే ఈ చర్యలన్నీ తనను పదవీచ్యుతుడిని చేయడానికేనని మదురో తెలిపారు. అమెరికా దాడులపై మౌనం వహిస్తున్న ఐరాసపై ఆయన మండిపడ్డారు.

ఆ వీడియోను విడుదల చేయం : పీట్ హెగ్‌సేథ్

కరేబియన్‌లో మాదక ద్రవ్యాలను రవాణా చేస్తున్న పడవపై గతంలో జరిపిన దాడిని చిత్రీకరించిన ఎడిట్ చేయని వీడియోను విడుదల చేయమని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేథ్ స్పష్టం చేశారు. ప్రతినిధి సభ, సెనెట్‌లకు చెందిన సాయుధ సర్వీసుల కమిటీలకు వీడియో ఫుటేజ్ చూపుతామని, ప్రజలకు దానిని బహిర్గతం చేయమని ఆయన చెప్పారు. 'ఒక పెద్ద రహస్యాన్ని, పూర్తి, ఎడిట్ చేయని వీడియోని విడుదల చేయం. అది కూడా ప్రజలకు' అని తెలిపారు. తూర్పు పసిఫిక్ సముద్రంలో మాదక ద్రవ్యాలను రవాణా చేస్తున్న మూడు పడవలపై సోమవారం దాడి చేశామని, ఎనిమిది మందిని మట్టుపెట్టామన్నారు. కాగా కరేబియన్, తూర్పు పసిఫిక్‌లోని అంతర్జాతీయ జలాల్లో ప్రయాణిస్తున్న ఓడలపై ఇప్పటి వరకూ జరిపిన ఇరవై ఐదు దాడుల్లో కనీసం 95 మంది మరణించారని అమెరికా అధికారులు తెలిపారు. వారంతా మత్స్యకారులని, సామాన్య పౌరులను అమెరికా హత్య చేసిందని వెనిజులా ప్రభుత్వం ప్రకటించింది.

'వైష్ణోదేవి' మెడికల్ అడ్మిషన్లపై సంఘ్ పరివార్ విద్వేషం

- తమ మతం వారికే సీట్లు రిజర్వ్ చేయాలని డిమాండ్



శ్రీనగర్ : ఆర్ఎస్ఎస్ దాని పరివారం దేశవ్యాప్తంగా విద్యా సంస్థల్లో విద్వేషం పెంచేందుకు యత్నిస్తున్నాయి. తాజాగా శ్రీనగర్‌లోని శ్రీ మాతా వైష్ణో దేవి మెడికల్ కాలేజీలో జరిగిన మొదటి బ్యాచ్ అడ్మిషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు ఆందోళనలు చేస్తున్నాయి. మొదటి బ్యాచ్‌లో 50మంది సెలక్ట్ కాగా వారిలో 44మంది ముస్లిం కమ్యూనిటీకి చెందినవారే కావడంపై వారు తీవ్రంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. వీరిలో సగం మందికి పైగా మహిళలే. ఈ అడ్మిషన్లను పరిశీలించాలని ఆ సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికి నెలన్నర రోజులుగా తరగతులు సాగుతున్నాయి. విద్యార్థుల మధ్య ఎలాంటి ఉద్రిక్తతలు, గందరగోళాలు కనిపించడం లేదు. వైష్ణో దేవి ఆలయానికి 16కిలోమీటర్ల దూరంలో వున్న మెడికల్ కాలేజీలో ఈ నిరసనలు, గందరగోళాలు తలెత్తలేదు. కానీ కేంపస్ వెలుపల ఇవి వూపందుకుంటున్నాయి. వైష్ణోదేవి ఆలయం ఇచ్చే విరాళాల కారణంగా హిందువులకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి సీట్లు రిజర్వ్ చేయాలని సంఘ్ పరివార్ మూకలు ఆందోళన చేస్తున్నాయి. అయితే కాలేజీ యాజమాన్యం ఇప్పటివరకు నీట్ పరీక్ష ద్వారానే మెరిట్ ఆధారిత నియామకాలే జరిపామని ప్రకటించింది. మొత్తం 16విభాగాల్లో 2800మంది విద్యార్థులు వుండగా, వారిలో కేవలం 2శాతం మాత్రమే ముస్లిం విద్యార్థులున్నారని అధికారులు తెలిపారు.. మిగిలినవారందరూ దేశవ్యాప్తంగా వివిధ కమ్యూనిటీలకు చెందినవారని కెంపస్‌లో ఎటువంటి ఘర్షణలు జరగలేదని బయటి వ్యక్తులు, సంస్థలు ఉద్దేశపూర్వకంగా సమస్యలను సృష్టిస్తున్నాయని పలువురు భావిస్తున్నారు..

జనవరిలో ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ భేటి

- గుంటూరులో 4 రోజులపాటు సమావేశం

ప్రజాశక్తి–గుంటూరు జిల్లా ప్రతినిధి

అఖిల భారత కిసాన్ సభ (ఎఐకె ఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలు గుంటూరులో జనవరి 29, 30, 31, ఫిబ్రవరి ఒకటవ తేదీన జరగనున్నాయి. వ్యవసాయంలో నెలకొన్న సంక్షోభం, పరిష్కారం, ఉద్యమానికి రైతులను సమాయత్త పర్చడం తదితర అంశాలపై ఈ సమావేశాల్లో చర్చించనున్నట్టు ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య తెలిపారు. ఎఐకెఎస్ ఆధ్వర్యంలో జరగనున్న సమావేశాల సన్నాహక సమావేశం బుధవారం గుంటూరులో జరిగింది. ఈ సమావేశానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం క్రమంగా కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి పోతున్న తరుణంలో దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ నాయకులు ఈ సమావేశానికి హాజరై తీసుకోనున్న నిర్ణయాలు, తీర్మానాలకు అనుగుణంగా భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు.

29 నుంచి జరిగే సమావేశాల్లో వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన ఎగ్జిబిషన్ స్టాల్స్, సాంస్కృతిక, వివిధ అంశాలపై సెమినార్లు నిర్వహిస్తామన్నారు. రిటైర్డు శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, ఆదర్శ రైతులు, రైతు శ్రేయోభిలాషులు, రైతు సంఘం రాష్ట్ర స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నాయకులు పాల్గొంటారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గుంటూరులో జరిగే ఎఐకెఎస్ జాతీయ సమావేశాలకు అశోక్ దావాలే, హనన్ మొల్ల, విజూ కృష్ణన్ హాజరవుతారని తెలిపారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కాపాడుకునేందుకు కృషి జరగాల్సి ఉందన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ టి రత్నారావు, కిసాన్ ఫౌండేషన్ అధ్యక్షులు బండ్ల సూరయ్య చౌదరి, లాం ఫారం మాజీ అసోసియేట్ డైరెక్టర్ ఆర్ అంకయ్య, తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు కళ్లం రాజశేఖర్ రెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణమూర్తి, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికోద్యమంలో తొలి చీలిక

1929-31
సంవత్సరాల మధ్య కాలంలో దేశంలో పెల్లుబుకుతున్న కార్మికవర్గ ఉద్యమాలను, కమ్యూనిస్టు ఉద్యమాన్ని సమూలంగా నాశనం చేయడానికి సామ్రాజ్యవాద ప్రభుత్వం కుట్రలు పన్నింది. అదే సమయంలో కార్మికోద్యమం చీలిపోయింది.దీంతో దేశంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం సంస్థాపరంగా తీవ్ర పరిస్థితులను ఎదుర్కొనవలసి వచ్చింది.

తొలినాళ్లలోనే భారతకార్మికోద్యమం చీలికకు గురైంది. ఎఐటియుసి 7,8,9 మహాసభల్లో ఈ దిశలో కొన్ని సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఎఐటియుసి 7వ మహాసభకు 17 యూనియన్ల ప్రతినిధులు హాజరయ్యారు. ఖరగ్‌పూర్‌లో బిఎన్ రైల్వే కార్మికుల వీరోచిత సమ్మె పోరాటం అప్పుడే ముగిసింది. సమ్మె ముగించిన తీరుపై మహాసభలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనాయి. ఎఐటియుసి 8వ మహాసభ 1927 నవంబర్ 26, 27 తేదీల్లో కాన్పూర్‌లో జరిగింది. ఆ సమయానికి లక్షా 25 వేల సభ్యత్వం కలిగిన 59 యూనియన్లు ఎఐటియుసికి అనుబంధంగా ఉన్నాయి. సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలని ఈ సమావేశంలోనే నిర్ణయించారు. భారత ప్రభుత్వ నిర్వహణకు ఒక శ్రామిక రాజ్యాంగాన్ని రూపొందించాలని నిర్ణయించి, ఒక ఉపసంఘం ఏర్పాటు చేసింది. దేశంలో కార్మికుల వేతనాలు అతి నికృష్టంగా ఉన్నాయని, వారి జీవితావసరాలకు తగిన విధంగా కనీస వేతనాన్ని నిర్ణయించే యంత్రాంగాన్ని ఏర్పరిచేందుకు ఒక చట్టాన్ని చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసింది. వివిధ దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు, కార్మిక సంఘాల నుంచి అసంఖ్యాకంగా సందేశాలు రావడం ఈ మహాసభ ప్రత్యేకత. బ్రిటీష్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ సౌహార్ద్ర ప్రతినిధి పూర్ సెల్ మాట్లాడుతూ లాంక్‌షైర్‌లోని బట్టల మిల్లుల్లోని కార్మికులు వారానికి 32 గంటలు మాత్రమే పనిచేస్తారని, ఇండియాలో అదే బట్టల మిల్లుల్లో 63 గంటలు పనిచేస్తున్నారని చెప్పారు. ప్రతి పరిశ్రమలోనూ కార్మికులు బ్రిటన్, అమెరికాల్లో అదే పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులతో పోల్చితే రెట్టింపు కాలం పనిచేస్తున్నారని చెప్పారు. నాటి సోవియట్ యూనియన్ కూడా శుభాకాంక్షలు తెలుపుతూ సందేశం పంపగా, సామ్రాజ్యవాదుల కుట్రలను తిప్పికొట్టి పదో వార్షికోత్సవంలో అడుగుపెట్టిన సోవియట్ యూనియన్‌ను అభినందిస్తూ మహాసభ తీర్మానాన్ని ఆమోదించింది. అయితే, బ్రిటిష్ ప్రభుత్వాన్ని తప్పు పట్టడం. సోవియట్ యూనియన్‌ను అభింనదించడం మహాసభ ప్రతినిధుల్లో కొందరికి నచ్చలేదు.

ఎఐటియుసి 9వ మహాసభ 1928 డిసెంబర్ 18 నుంచి 20 వరకూ ఝరియాలో జరిగింది. ఈ మహాసభకు 98 వేల సభ్యత్వం కలిగిన 42 అనుబంధ యూనియన్ల నుంచి 200 మంది ప్రతినిధులు హాజరయ్యారు. సామ్రాజ్యవాద వ్యతిరేక సమితికి చెందిన జెడబ్ల్యు జాన్‌స్టోన్‌ను మహాసభ ముగియగానే పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. 1928 డిసెంబర్ 22న జరగనున్న అఖిలపక్ష సమావేశం ముందు పలు డిమాండ్లను ఉంచాలని మహాసభ నిర్ణయించింది. 1. భూమి, పరిశ్రమల జాతీయం, 2. వయోజన ఓటింగ్, 3. సమ్మె హక్కు,

భూస్వామ్య విధానాన్ని రద్దు చేసి కార్మికవర్గ సోషలిస్టు రిపబ్లిక్ ప్రాతిపదికపై రాజ్యాంగ రూపకల్పన. బెర్లిన్‌లోని సామ్రాజ్యవాద వ్యతిరేక సమితికి ఎఐటియుసిని అనుబంధం చేయాలని మరొక తీర్మానం ఆమోదించారు. ఈ సమావేశంలో జరిగిన చర్చలు కూడా విభేదాలను మరింత పెంచాయి.



ఎఐటియుసి మహాసభ (ఫైల్‌ఫోటో)

తొలి చీలిక

దేశంలో కార్మికుల జీవన పరిస్థితులపై జెహెచ్ విట్లే అధ్యక్షతన 'రాయల్ కమిషన్ ఆన్ లేబర్'ను 1929 జులైలో నియమించగా, దానిని బహిష్కరించాలని ఎఐటియుసిలోని మెజారిటీ సభ్యులు తీర్మానించినా, చమన్‌లాల్, ఎన్ఎం జోషి కమిషన్ సభ్యులుగా చేరడం గమనార్హం. 1929 నవంబర్ 28 నుంచి 30 వరకూ నాగపూర్‌లో జరిగిన ఎఐటియుసి పదో మహాసభకు జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షత వహించారు. తీవ్ర వాదోపవాదాల తరువాత పాన్ పసిఫిక్ ట్రేడ్ యూనియన్ సెక్రటేరియట్‌కు అనుబంధం చేయాలని మెజారిటీ నిర్ణయించింది. ఆ తరువాత ప్రతిపాదించిన వారే విరమించుకున్నారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో కమ్యూనిస్టులపై తీర్మానాలను మెజారిటీ బలపరచగా, సంస్కరణవాదులు వాకౌట్ చేసి, జోషి నివాసంలో వేరే సమావేశం ఏర్పాటు చేశారు. పదో మహాసభలో రెండు పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాల మధ్య ఘర్షణ ఎఐటియుసిలో తొలి చీలికకు దారితీశాయి.

ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ స్థాపన

ఎఐటియుసి మహాసభ నుంచి వాకౌట్ చేసిన సంస్కరణ వాదులు, చీలికవాదులు 1929 డిసెంబర్ 1న వేరే సమావేశం ఏర్పాటు చేసి ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్‌గా తాత్కాలికంగా కొత్త సంస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కార్మికోద్యమాన్ని నిర్మించేందుకు కృషి చేయడానికి బదులు, అధికార కమిషన్లు, సమావేశాల విషయంలో ప్రభుత్వంతో సహకరించి, సామ్రాజ్యవాదుల వలస ప్రయోజనాలను పరిరక్షించిన వీరికి బ్రిటీష్ ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ ఉదారంగా ఆర్థిక సహాయం అందించింది.

రెండో చీలిక

కలకత్తాలో సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన 1931 జులై 3 నుంచి 7 వరకు జరిగిన ఎఐటియుసి 11వ మహాసభలో గిర్నికాంగార్ యూనియన్ ప్రాతినిధ్యం గురించి తలెత్తిన వివాదం ఎఐటియుసిలో రెండో చీలికకు కారణమైంది. ఎంఎన్ రాయ్ అనుచరులు కమ్యూనిస్టుల నాయకత్వంలోని గిర్నీ కాంగార్ యూనియన్‌ను కూలదోసి, తమ నాయకత్వంలోని యూనియన్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని పట్టుబట్టడం చీలికకు ప్రధాన కారణమైంది. తర్వాత దశలో కార్మికోద్యమం కార్మికవర్గ ఐక్యతను పున:ప్రతిష్ఠించడానికి సర్వవిధాలా కృషి చేసింది.

ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

లేబర్‌కోడ్‌లు
అసత్య ప్రచారాలు ...వాస్తవాలు

ప్రచారం

లేబర్ కోడ్‌ల ద్వారా 29 చట్టాలను సరళీకరించాం.

వాస్తవం

- కార్మికులకు చట్టపరమైన రక్షణను బలహీనపర్చడం, రద్దు చేయడం లేబర్‌కోడ్‌ల అసలు లక్ష్యం
- ఉద్యోగ భద్రత ఉండదు. కార్మిక శాఖకు ఎటువంటి పాత్ర లేదు
- చట్టపరిధికి వెలుపల అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 90శాతం మందికి నియామక పత్రాలు ఇచ్చేదెవరో కూడా తెలియని స్థితి.

కార్మికోద్యమ యోధులు



లక్ష్మీదాస్

జననం : 1.05.1918
మరణం : 20.06.1986

లక్ష్మీదాస్ 1938లో ట్రేడ్‌యూనియన్ రంగంలోకి ప్రవేశించారు. హైదరాబాద్ కార్మికోద్యమ నిర్మాతల్లో ఒకరు. ఆంధ్ర మహాసభలో పాల్గొంటూ, కార్మికోద్యమ నిర్మాణానికి కృషి చేశారు. 'ఆల్ హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్' ఏర్పాటు చేసిన నాయకులలో లక్ష్మీదాస్ ఒకరు. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని అజ్ఞాతవాసం గడిపారు. 1962 మిర్యాలగూడెం నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. విశాఖ ఉక్కు సాధన కోసం జరిగిన ఉద్యమం సందర్భంగా పదవికి రాజీనామా చేశారు.

చీరాలలో కాల్పులు

- దేశ వ్యాప్తంగా ఆందోళన

తొలినాళ్లలో రాష్ట్రంలో కార్మికోద్యమం (1936-42)

చీరాలలో పొగాకు కార్మికులపై 1938 ఫిబ్రవరిలో చోటుచేసుకున్న పోలీసు కాల్పుల ఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపింది. అనేక చోట్ల కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు జరిగాయి. చీరాలలోని ఐఎల్‌టిడి కంపెనీ ఈ సంఘటనకు కేంద్రం! కంపెనీలో దయనీయమైన పరిస్థితులు ఉండేవి. కూలీలు రోజుకు పది గంటలు పనిచేయాల్సివచ్చేది. పురుషులైనా, మహిళలైనా, పిల్లలైనా సెలవులు ఉండవు. పని సమయంలో తినడానికి, తాగడానికి కూడా అనేక ఆంక్షలు! పొగాకు నుండి వచ్చే గ్యాస్ కారణంగా తీవ్ర అస్వస్థతకు గురవుతూ పనులు చేసేవారు. ఇంతా చేస్తే వారికి రోజుకు ఇచ్చే కూలీ 25 పైసలు మాత్రమే! ఇదే కంపెనీలో పనిచేసే మేనేజర్‌కు రోజుకు 100 రూపాయల జీతం! అసమానతలు ఏ స్థాయిలో ఉండేవో అర్థం చేసుకోవడానికి ఈ పోలిక చాలు కదా! ఈ కంపెనీలో 5వేల మంది పనిచేసేవారు. సీజన్‌లో మనో వెయ్యిమంది అదనంగా పనిచేసేవారు. 1937లో మల్లాది యజ్ఞనారాయణ నాయకత్వాన పొగాకు కార్మికుల యూనియన్ ఏర్పాటైంది. 3వేల మంది సభ్యులుగా చేరారు. అయితే, యూనియన్ అద్యక్షుడు కార్మికుడే అయి ఉండాలని, బయట వారు ఉండటానికి వీలు లేదని కంపెనీ యాజమన్యం పేచీ పెట్టింది. బయట వ్యక్తుల నేతృత్వంలో ఉంటే ఆ యూనియన్‌తో చర్చించేది లేదని భీష్మించింది. పని సరిగా చేయడం లేదంటూ ఇద్దరు కార్మికులకు తొలగించింది. ఈ నేపథ్యంలో 1938 ఫిబ్రవరి 8వ తేదిన కంపెనీలో సమ్మె ప్రారంభమైంది. మేనేజిమెంట్ కంపెనీని మూసివేసింది. ఫిబ్రవరి 10వ తేదిన కంపెనీని మళ్లీ తెరిచారు. కొందరు కార్మికులు మాత్రమే విధులకు హాజరయ్యారు. చర్చల కోసం మద్రాసు నుండి (అప్పట్లో మద్రాసు రాష్ట్రంలోనే ఆంధ్ర ప్రాంతం కలిసి ఉండేది) కార్మికశాఖ మంత్రి చీరాలకు వచ్చారు. కానీ, ఫలితం కనిపించలేదు. ఫిబ్రవరి 14వ తేదిన శాంతియుతంగా పికెటింగ్ జరుగుతున్న నేపథ్యంలో భద్రత కోసం వచ్చిన పోలీసులు కాల్పులు జరిపారు. ఈకాల్పుల్లో ముగ్గురు మరణించారు. అనేక మంది గాయపడ్డారు. దీనికి నిరసనగా దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. రాష్ట్రంలో ఒంగోలు, గుంటూరు,తెనాలి, రాజమండ్రి, ఇందుపూరు, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో నిరసన సభలు నిర్వహించారు. ఈ సంఘటనపై రూథర్‌పోర్డ్‌ను రాజాజీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విచారణాధికారిగా నియమించింది. 1921వ సంవత్సరంలో పన్నుల నిరాకరణ ఉద్యమం సమయంలో రూథర్‌ఫోర్డ్ స్థానికంగా తీవ్ర అకృత్యాలకు పాల్పడ్డాడు. తిరిగి ఆయననే విచారణాధికారిగా నియమించడం పట్ల కాంగ్రెస్ నాయకులు కూడా తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల నుండి ఒత్తిడి రావడంతో రూథర్‌ఫర్డ్ స్థానంలో మద్రాసు హైకోర్టు జడ్జి హార్విల్‌ను ప్రభుత్వం నియమించింది. అయితే, విచారణ సవ్యంగా జరగనీయకుండా కార్మికుల అరెస్ట్ వంటి అన్ని చర్యలకు ప్రభుత్వం దిగింది. యాజమాన్యం అనేక దొంగ సాక్ష్యాలు ఇప్పించింది. కార్మిక సంఘాన్ని విచారణలో పాల్గొననీయలేదు. పోలీస్ సాక్షులకు క్రాస్ పరీక్ష నిర్వహించలేదు. గాయపడిన వారిలో వెనుకవైపు తగిలిన దెబ్బలున్నాయని, పారిపోతున్న వారిపై కాల్పులు జరిపారని డాక్టర్ సిమ్సన్ సాక్ష్యమిస్తే అది సరికాదని హార్విల్ నివేదికలో పేర్కొన్నారు. ఈ విచారణ ఫలితం ఎలా ఉందో ప్రత్యేకంగా చెప్పాలా? అయినప్పటికీ పొగాకు కంపెనీల్లో నెలకొన్న అమానవీయ పరిస్థితులను, కార్మికుల పట్ల పాలకవర్గాల వైఖరిని ఈ పోరాటం ప్రజల ముందు ఉంచడంలో విజయవంతమైంది.

ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

ఓ కార్మికుడా..

కర్మాగారాలలో
నలుగుతున్న కార్మికుడా
నీ చేతుల నైపుణ్యం
జగతి ప్రగతి చక్రంరా
నీ నడకే ఆగితే
విశ్వమంత చీకటిరా
మహోన్నతం నీ త్యాగం
మరువదెపుడు మా హృదయం



అభివృద్ధి అంటే..

శ్రమలో ఉన్నది ప్రపంచ ప్రగతి
దానికి మూలం కార్మికశక్తి
చెమట చుక్కలే చిందని నాడు
అభివృద్ధంటే అర్థం లేదు
కష్టజీవులు నవ్వని నాడు
మన గొప్పలకు అర్థం లేదు
కష్టపడే ఆ చేతుల సైన్యం
కండ గుండె వారికి ధైర్యం

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికలకు నామినేషన్స్ పూర్తి

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికలు ఈ నెల 28వ తేదీ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్ లో జరగుబోతున్నాయి. ఎన్నికల నిర్వహణాధికారిగా దుర్గాప్రసాద్ వ్యవహరిస్తున్నారు. 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' లోని నాలుగు విభాగాలకి ఈ ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో నామినేషన్స్ ప్రక్రియ పూర్తయ్యింది. అభ్యర్థుల ఉపసంహరణ గడువుతేదీ 19వ తేదీ వరకూ ఉంది. 20వ తేదీన బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను ఎన్నికల అధికారి ప్రకటిస్తారు. స్టూడియో సెక్టార్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి మొత్తం నాలుగు పోస్టులు ఉండగా, ఈసారి ఎనిమిది మంది నామినేషన్స్ దాఖలు చేశారు. అలానే స్టూడియో సెక్టార్ కౌన్సిల్‌లో ఏడు పోస్టులున్నాయి. దానికి 12 మంది నామినేషన్లు వేశారు. ఎగ్జిబిటర్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి మొత్తం 16 పోస్టులు ఉండగా, 29 మంది నామినేషన్స్ వేశారు, అలాగే ఎగ్జిబిటర్ సెక్టార్ కౌన్సిల్‌కు 40 పోస్టులు ఉండగా, 21 మంది మాత్రమే నామినేషన్లు దాఖలు చేయటం విశేషం. ఇక డిస్ట్రిబ్యూటర్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి 12 పోస్టులు ఉండగా, 30 మంది నామినేషన్స్ వేశారు. డిస్ట్రిబ్యూటర్స్ సెక్టార్ కౌన్సిల్‌కు 20 పోస్టులు ఉండగా, 34 మంది నామినేషన్స్ వేశారు. ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి 12 పోస్టులు ఉండగా, 36 మంది నామినేషన్స్ వేశారు. అలానే ప్రొడ్యూసర్స్ సెక్టార్ కౌన్సిల్‌కు 20 పోస్టులు ఉండగా, 32 మంది నామినేషన్స్ వేశారు. డిసెంబర్ 28వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు ఎన్నికలు పూర్తి కాగానే ఓట్ల లెక్కింపు జరిపి విజేతలను ప్రకటిస్తారు. ఈ సారి ఎగ్జిబిటర్స్ సెక్టార్‌కు చెందిన వ్యక్తిని ఛాంబర్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేయనున్నారు.



ఏఎన్ఆర్ విద్యార్థుల స్కాలర్‌షిప్‌కు రూ.రెండు కోట్లు విరాళం : నాగార్జున

ఏఎన్ఆర్ కళాశాల విద్యార్థులకు స్కాలర్ షిప్ అందించేందుకు అక్కినేని నాగేశ్వరరావు, అన్నపూర్ణమ్మ పేర్ల మీద తమ కుటుంబం తరఫున రూ.రెండు కోట్లను అందిస్తున్నట్లు సినీ హీరో నాగార్జున ప్రకటించారు. కృష్ణా జిల్లా గుడివాడలో ఏఎన్ఆర్ కళాశాల వజ్రోత్సవాలు బుధవారం రెండవ రోజు కొనసాగాయి. ఈ వేడుకల్లో హైకోర్టు జస్టిస్ బట్టు దేవానంద్, సినీ హీరో అక్కినేని నాగార్జున, గుడివాడ, పామర్రు ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. నాగార్జున మాట్లాడుతూ.. మనుషులు శాశ్వతం కాదనీ వారు చేసే పనులే శాశ్వతమన్నారు. తాను చదువుకోలేకపోయినా వేలాదిమంది విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం తమ తండ్రి నాగేశ్వరరావు కళాశాలను స్థాపించారని తెలిపారు. రైతు బిడ్డ అయిన నాగేశ్వరరావుకు చదువు అంటే ఎంతో ఇష్టమని గుర్తు చేశారు. 1951లో సినిమాకు రూ. ఐదు వేలు వచ్చే ఆ రోజుల్లోనే రూ. లక్ష రూపాయలు కళాశాలకు విరాళంగా ఇచ్చారని తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేయబోయే స్కిల్ డెవలప్‌మెంట్ అభివృద్ధికి మంత్రి లోకేష్ సహకరించేలా ఎమ్మెల్యే రాము కృషి చేయాలని కోరారు. దేవానంద్ మాట్లాడుతూ.. ఈ కళాశాలలో చదివిన నేను హైకోర్టు న్యాయమూర్తి స్థాయికి ఎదిగానని చెప్పారు. అక్కినేని పెద్ద కుమారుడు, కుమార్తెలు వెంకట్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

చిన్న సినిమాలను ప్రోత్సహించాలి



'తెలుగు చలన చిత్ర పరిశ్రమ బలోపేతంతో పాటుగా అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఎపి డిప్యూటీ సిఎం కె. పవన్‌కళ్యాణ్‌ను కోరుతున్నాం. తెలుగు చిత్రపరిశ్రమలో చిన్న సినిమా చితికిపోయి శల్యమైపోతోంది. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి సినిమా తీస్తే తిరిగి డబ్బులు రాకపోగా అప్పుల ఊబిలోకి కూరుకుపోయే ప్రమాదం ఉంది. 100 నుంచి 150 సినిమాలు ఏటా వస్తుంటే వాటిలో 80 శాతం కొత్త వారితోనే సినిమా తీసేవాళ్లు ఉన్నారు. సినిమా రంగం మద్రాస్‌లో ఉన్నప్పుడు కళకళలాడింది. చేతినిండా పని ఉండేది. ఆ నాటి నిర్మాతలు సినిమాని బ్రతికిస్తూ కొత్తవారిని ప్రోత్సహిస్తూ సినీ కళామతల్లి ముద్దుబిడ్డలయ్యారు. కథానాయకులు ఎన్టీఆర్, కృష్ణ లాంటి వాళ్లు కూడా అలాగే చేశారు. ఆ నాటి నిర్మాతలు సినిమాపై ప్రేమతో తీసేవారు. నేడు పెద్ద నిర్మాతలు మల్టీ లాభాపేక్షతో పెద్ద హీరోల సినిమాను బిజినెస్‌గా మార్చుకున్నారు. ఓటీటీ ఛానళ్లు, డిస్ట్రిబ్యూటర్లు పూర్తిగా పెద్దవారి చేతుల్లోకి వెళ్లిపోయాయి. చిన్న సినిమాలు ప్రపంచ వ్యాప్తంగా విడుదలయ్యే అవకాశం లేదు. డిస్ట్రిబ్యూటర్లు చిన్న నిర్మాతలను ఇబ్బందులు పెడుతున్నారు. సినిమాటోగ్రఫీ శాఖ ద్వారా చిన్న నిర్మాతలకు నేరుగా థియేటర్ ఇప్పించేలా ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. ఆంధ్రాలో షూటింగ్ చేస్తే అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఆంధ్రాలో ఎఫ్‌డిసికి షూటింగ్ ముందే దరఖాస్తు చేసుకున్నా, సినిమా పూర్తయిన తర్వాత కూడా సబ్సిడీ రాని పరిస్థితి నెలకొంది. చిన్న సినిమా బ్రతికి బట్టకట్టాలంటే సినిమాటోగ్రఫీ మంత్రిత్వశాఖలు స్పందించాలి. ఆదిశగా పవన్‌కళ్యాణ్ స్పందించాలని కోరుతున్నా' విఆర్‌పి క్రియేషన్స్ అధినేత, రచయిత, దర్శకుడు, నిర్మాత పసుపులేటి వెంకటరమణ ఓ లేఖలో పేర్కొన్నారు.

దర్శకుడు కేకే కన్నుమూత



తెలుగు ఇండస్ట్రీలో విషాదం చోటుచేసుకుంది. దర్శకుడు కేకేగా గుర్తింపు పొందిన కె. కిరణ్ కుమార్ హఠాన్మరణం చెందారు. కడుపు సంబంధిత సమస్యలతో ఇటీవల హస్పిటల్‌లో చేరిన ఆయనకు శస్త్ర చికిత్స చేశారు. అయితే అది విఫలం అవడంతో ఆయన బ్రెయిన్ డెడ్ అయ్యారని తెలుస్తోంది. ఈ విషయమై పూర్తి సమాచారం రావాల్సి ఉంది. 2010లో నాగార్జున హీరోగా వచ్చిన కేడీ సినిమాకు కిరణ్ దర్శకత్వం వహించారు. ఆ తరువాత తిరిగి 15 ఏళ్లకి రీ ఎంట్రీ ఇస్తూ కేజేక్యూ అనే చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఆ సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. 'అర్జున్ రెడ్డి', 'కబీర్ సింగ్', 'యానిమల్' సినిమాలు తెరకెక్కించిన సందీప్ రెడ్డి వంగా, 'దసరా' చిత్రం తెరకెక్కించిన శ్రీకాంత్ ఓదెల వంటి డైరెక్టర్లు గతంలో కిరణ్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్లుగా పని చేశారు.



19న 'గుర్రం పాపిరెడ్డి'


నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. 'డార్క్ కామెడీ' అనే వైవిధ్యమైన జోనర్‌లో ఇది తెరకెక్కింది. ఈ నెల 19న విడుదల కానున్న నేపథ్యంలో, తాజాగా చిత్ర యూనిట్ ప్రీ-రిలీజ్ ప్రెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ వేడుకలో బ్రహ్మానందం ముఖ్య అతిథిగా పాల్గొని చిత్ర విశేషాలను పంచుకున్నారు. ఈ చిత్రంలో ఆయన జడ్జి పాత్రలో కనిపిస్తున్నారు. ఆయన మాట్లాడు తూ, 'ఈ సినిమా కథను ప్రేక్షకులకు వివరించే కీలక బాధ్యత తన పాత్రదే'నని తెలిపారు. 'దర్శకు డు మురళీ మనోహర్ ఈ తరం ప్రేక్షకులకు నచ్చేలా ఒక సరికొత్త కథాంశాన్ని ఎంచుకున్నారు. నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా తమ పాత్రల కోసం పడిన శ్రమ అద్భుతం. ముఖ్యంగా వారి ఓల్డ్ ఏజ్ గెటప్స్ చూసి నేను మొదట గుర్తుపట్టలేకపోయాను' అని ప్రశంసించారు. తమిళ కమెడియన్ యోగి బాబు ఈ చిత్రంలో తనదైన శైలిలో నవ్వులు పూయిస్తారని, ఆయన పాత్ర సినిమాకు ప్రత్యేక ఆకర్షణ అని బ్రహ్మానందం పేర్కొన్నారు. ఫరియా అబ్దుల్లా ఈ చిత్రంలో 'సౌధామిని' అనే పాత్రలో కనిపించ బోతున్నారు. ఆమె ఈ చిత్రంలో నటించడమే కాక, ఒక పాట రాసి, పాడి, కొరియోగ్రఫీ కూడా చేశారు. డా. సంధ్య గోలీ సమర్పణలో వేణు సద్ది, అమర్ బుర్రా, జయకాంత్ (బాబీ) ఈ సినిమాని నిర్మించారు.

పొగమంచుతో టి20 రద్దు

- 19న అహ్మదాబాద్‌లో ఐదో, చివరి టి20

- శుభ్‌మన్ గిల్ ఔట్.. సంజు ఇన్..
- ఐదు టి20ల సిరీస్‌లో 2-1 ఆధిక్యతలో టీమిండియా

లక్నో: భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరగాల్సిన నాల్గో టి20కి అధిక పొగమంచు కారణంగా రద్దయ్యింది. మహారాష్ట్రలోని ఏక్నా స్టేడియంలో జరగాల్సిన ఈ మ్యాచ్ బుధవారం రాత్రి 7.00గం॥ల నుంచి రాత్రి 9.30గం॥ల వరకు కమ్మేసింది. దీంతో పొగమంచు తగ్గితే మ్యాచ్‌ను నిర్వహించాలని చూసిన అంపైర్ల నిరీక్షణ ఫలించ లేదు. దీంతో రాత్రి 9.30గంటల తర్వాత మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో మ్యాచ్‌ను చూసేందుకు వచ్చిన అభిమానులు నిరాశతో గ్యాలరీలను వీడారు. అధిక పొగమంచు కారణంగా కనీసం టాస్ వేసే అవకాశం కూడా దక్కలేదు. దీంతో లక్నోలోని ఏక్నా స్టేడియంలో జరిగే నాల్గో టి20లోనూ గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని ఆశించిన టీమిండియాకు ఇది నిరాశగా మిగిలింది.



మహారాష్ట్రలోని ఏక్నా స్టేడియంను కమ్మేసిన పొగమంచు

ఐదు టి20ల సిరీస్‌లో భారత్ 2-1 ఆధిక్యతలో ఉన్న సంగతి తెలిసిందే. నాల్గో టి20కి ముందు భారతజట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ పాదం గాయం కారణంగా ఈ టి20కి మ్యాచ్‌కు దూరమయ్యాడు. దీంతో అతడు మిగిలిన రెండు మ్యాచ్‌లకు బరిలోకి దిగడం కష్టమే. దీంతో అతడి స్థానంలో తుదిజట్టులోకి సంజు శాంసన్ వచ్చి చేరాడు. ఇక అనారోగ్యంతో చివరి రెండు టి20లకు దూరమైన అక్షర్ పటేల్ స్థానంలో బిసిసిఐ షాబాజ్ అహ్మద్‌ను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఇక ఐదో, చివరి టి20 అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరగనుంది. ఆ మ్యాచ్‌లో భారతజట్టు గెలిస్తే సిరీస్ సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకోనుండగా.. దక్షిణాఫ్రికా గెలిస్తే 2-2తో సిరీస్ సమం కానుంది.

క్యారీ సెంచరీ

ఆస్ట్రేలియా 326/8
యాషెస్ సిరీస్ మూడో టెస్ట్



ఆడిలైడ్: యాషెస్ సిరీస్ మూడోటెస్ట్‌లో ఆస్ట్రేలియా వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ సెంచరీతో రాణించాడు. మిడిలార్డర్‌లో ఉస్మాన్ ఖవాజా కూడా అర్ధసెంచరీతో రాణించడంతో తొలిరోజు ఆట ముగి సేసరికి ఆస్ట్రేలియా జట్టు 8వికెట్ల నష్టానికి 326 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్‌కు శుభారంభం దక్కలేదు. ఇంగ్లండ్ బౌలర్లు తొలుత కట్టడిగా బౌలింగ్ చేయడంతో ఆసీస్ ఓపెన ర్లు హెడ్(10), వెథర్లాండ్(18)కి తోడు లబూషేన్(19) స్వల్ప స్కోర్లకే పెవీలి యన్‌కు చేరారు. ఆసీస్ జట్టు 33 పరుగుల వద్ద ఓపెనర్ల వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత ఖవాజా, క్యారీ ఆదుకోవడంతో ఆ జట్టు గౌరవప్రద స్కోర్ చేసింది. క్రీజ్‌లో స్టార్క్(33), లియాన్(0) ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లు ఆర్చర్‌కు మూడు, కర్సే, విల్ జాక్స్‌కు రెండేసి, టంగ్‌కు ఒక వికెట్ దక్కాయి. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా 2-0 ఆధిక్యతలో ఉంది.

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: హెడ్ (సి)క్రాలే (బి)కర్సే 10, వెథర్లాండ్ (సి)జేమీ స్మిత్ (బి)ఆర్చర్ 18, లబూషేన్ (సి)కర్సే (బి)ఆర్చర్ 19, ఖవాజా (సి)టంగ్ (బి)విల్ జాక్స్ 82, గ్రీన్ (సి)కర్సే (బి)ఆర్చర్ 0, క్యారీ (సి)జేమీ స్మిత్ (బి)విల్ జాక్స్ 106, ఇంగ్లిస్ (బి)టంగ్ 32, కమిన్స్ (సి)పోప్ (బి)కర్సే 13, స్టార్క్ (బ్యాటింగ్) 33, లియాన్ (బ్యాటింగ్) 0, అదనం 13. (83ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 326పరుగులు. **వికెట్ల పతనం:** 1/33, 2/33, 3/94, 4/94, 5/185, 6/244, 7/271, 8/321. **బౌలింగ్:** ఆర్చర్ 16-5-29-3, కర్సే 13-0-70-2, టంగ్ 15-1-63-1, స్టోక్స్ 19-3-53-0, విల్ జాక్స్ 20-3-105-2.



సయ్యద్ ముస్తాక్ అలీ టైటిల్ కొట్టేదెవరో..?

నేడు హర్యానా, జార్ఖండ్ మధ్య ఫైనల్ పోరు

పూణే: సయ్యద్ ముస్తాక్ అలీ టైటిల్ పోటీ గురువారం జరగనుంది. మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరిగే ఫైనల్లో హర్యానా, జార్ఖండ్ జట్లు తలపడనున్నాయి. సూపర్ లీగ్‌లో మెరుగైన రన్‌రేట్‌తోనే ఈ రెండు జట్లు ఫైనల్‌కు చేరాయి. చివరి గ్రూప్-బి లీగ్ మ్యాచ్‌లో జార్ఖండ్ జట్టు ఆంధ్ర చేతిలో ఓడగా... హర్యానా జట్టు 124 పరుగుల తేడాతో హైదరాబాద్‌ను చిత్తుచేసి గ్రూప్-ఎ టాపర్‌గా నిలిచింది. గ్రూప్-ఎలో హర్యానా(+2.32), హైదరాబాద్(-0.41), ముంబయి(-0.70) 8పాయిం ట్లతో నిలిచినా.. మెరుగైన రన్‌రేట్‌తో టాపర్‌గా నిలిచింది. మరోవైపు గ్రూప్-బిలో జార్ఖండ్(+0.22), ఆంధ్రప్రదేశ్ (-0.11) 8పాయింట్లతో నిలిచాయి. జార్ఖండ్ జట్టుకు ఇషాన్ కిషన్, హర్యానా జట్టుకు అంకిత్ కుమార్ సారథ్యం వహిస్తున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68